
శుక్రవారం 2 ఫిబ్రవరి 2024

https://www.telugudesam.org



# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



శ్రీశైలంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న లోకేష్ దంపతులు 6

మహిళా పక్షపాతి చంద్రబాబు : భువనేశ్వరి 5

ఓటర్ల తుది జాబితాలో తప్పులు సరిదిద్దాలి: వర్ల 7

**Voice of the leader**

వైసీపీలో అందరినీ మారుస్తున్నారు. పెద్దిరెడ్డిని మార్చే ధైర్యం జగన్‌కు ఉందా?. వైసీపీలో 68 నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లను మార్చారు. అందులో 49 మంది బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలే. వైసీపీలో పది మంది మంత్రులకు సీట్లు ఇవ్వలేదు. ఆ పార్టీలో సామాజిక న్యాయం లేదు. ఎమ్మెల్యేల్లో తిరుగుబాటు ప్రారంభమైంది. ఈ తిరుగుబాటు ఇక్కడితో ఆగదు. వైసీపీకి చాలామంది దూరమైపోతున్నారు. మనం గేట్లు తెరిస్తే మొత్తం ఖాళీ అవుతుంది.

- నారా చంద్రబాబునాయుడు



# అదిగో.. వికసిత భారత్

- ఐదేళ్లలో 2 కోట్ల ఇళ్ల నిర్మాణం లక్ష్యం
- మధ్యతరగతి ఇళ్లకు ప్రత్యేక పథకం
- మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట
- పేదరికం సమూల నిర్మూలనే లక్ష్యం..
- పేదలు, మహిళలు, యువత, రైతులకు ప్రాధాన్యం
- పన్ను రేట్లు, శ్లాబుల్లో మార్పు లేదు
- మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి
- వరుసగా ఆరు బడ్జెట్లతో మొరార్జీ సరసన నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్'. అన్ని రంగాల్లోనూ దేశాభివృద్ధిపై నరేంద్ర మోదీ ప్రభుత్వం దృష్టి సారించిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. పేదలు, మహిళలు, యువత, రైతాంగం.. ప్రధానంగా ఈ నాలుగు వర్గాలకు నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చిందన్నారు. ఈ నాలుగు వర్గాలను శక్తివంతం చేయడంతోపాటు, అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించి.. వికసిత భారత్‌ను ఆవిష్కరించటమే తమ ముందున్న కర్తవ్యంగా ప్రకటించారు. 2024-25 సంవత్సరానికి మధ్యంతర బడ్జెట్‌ను లోక్‌సభలో గురువారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పవేశపెట్టారు. 58 నిమిషాల పాటు సాగిన ఆర్థిక మంత్రి సుదీర్ఘ ప్రసంగంలో.. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని ప్రభుత్వం గత పదేళ్ల కాలంలో సాధించిన ప్రగతిని వివరించటానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. సబ్ కా సాథ్ సాధనతో పేదరికాన్ని పారదోలేందుకు ప్రభుత్వం 25 కోట్లమందికి సహాయం అందజేసిందన్నారు.

- మిగతా 2వ పేజీలో...

18 కౌంట్‌డౌన్ **కామెంట్రీ**



అభ్యర్థుల ఎంపికలో కీలక మార్పులతో ఐదో జాబితా విడుదల చేసిన వైసీపీ. గెలుపు లక్ష్యంగా.. ఎంపికైన ఇన్‌ఛార్జిలు కూడా చివరి క్షణంలో మారొచ్చని సంకేతం

ఒకట్రెండు.. నాలుగైదు
వరసపెట్టి జాబితాలు....
తీసివేత కూడికలు
మార్చగలవ జాతకాలు!!

మార్పులతో మారుతుంద
అభ్యర్థుల తలరాత..
గెలుపులేని తీరానికి
వైకాపా ఎదురీత!!

కడవరకూ సాగునంట
ఎగతెగని వడపోత
గెలుపుకదే సూత్రమంట
సెలవిచ్చిరి.. నియంత!!

వేలంలో తగిన రేటు
పాడగల ఘనుడుంటే..!
ఎంపికైన వాడప్పుడు..
ఎంగిలాకు సమానుడే!!

-మహాదేవ

# కంటిరెప్పల్లా కాపాడుకుంటాం

- అధైర్య పడొద్దు... మీతో మేముంటాం
- కార్యకర్తల కుటుంబాలకు భువనేశ్వరి పరామర్శ
- ఒక్కో కుటుంబానికి రూ.3లక్షలు ఆర్థికసాయం

4



2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యంగా

# కేంద్ర బడ్జెట్

- మౌలిక రంగానికి, స్కిల్ ఇండియాకు కేంద్ర తోడ్పాటును స్వాగతిస్తున్నాం
- విభజనచట్టం హామీల అమలుకు నిధులు సాధించడంలో జగన్ మరోమారు విఫలం
- వైకాపాకు 31 మంది ఎంపీలు ఉన్నా ఉపయోగం శూన్యం
- బడ్జెట్‌పై అచ్చెన్నాయుడి స్పందన

7

మొండితోక..

# నిలువెల్లా అవినీతే!!



- డాక్టర్ ఎమ్మెల్యే దోపిడీ 1200 కోట్లు
- ఎమ్మెల్సీ తమ్ముడే అతని సైన్యం..
- కొండలు పిండేశారు.. చెరువులు పీల్చేశారు
- ప్రతి పనికీ రేటు.. కాదంటే కాటు
- చీకటి పనులకు అనధికార కేబినెట్
- శ్రీవారి సిఫార్స్ టికెట్లకూ శఠగోపం

ఇదీ మొండితోక బ్రదర్స్ అంతులేని దందా

10

చైతన్యరథం

# అదిగో... వికసిత భారత్





## సమగ్రం.. వినూత్నం: మోదీ

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌కు సమర్పించిన మధ్యంతర బడ్జెట్ సమగ్రంగా, వినూత్నంగా ఉందని ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. అభివృద్ధి కొనసాగుతుందనే విశ్వాసాన్ని కల్పిస్తోందని, వికసిత్ భారతానికి నాలుగు స్తంభాలైన యువత, పేదలు, మహిళలు, రైతులను బడ్జెట్ శక్తివంతం చేస్తుందని హర్షం వ్యక్తం చేశారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా నిలపడానికి హామీ ఇస్తోందని విశ్వాసం వ్యక్తం చేశారు.

*(మొదటి పేజీ తరువాయి)*

గత పదేళ్ల కాలంలో సబ్‌కా సాథ్ ద్వారా పేదరికాన్ని భారీగా నిర్మూలించామన్నారు. గత దశాబ్ద కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ సానుకూల పరివర్తన చెందిందని, భవిష్యత్తుపై ఆశలు చిగురించాయని సీతారామన్ విశ్వాసం వ్యక్తం చేశారు. దేశ ప్రజలు భవిష్యత్తు వైపు ఆశతో ఎదురుచూస్తున్నారని అంటూనే -సమగ్రాభివృద్ధి, వృద్ధి లక్ష్యంగా గ్రామీణ స్థాయి వరకు సేవలను అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ప్రతి ఇంటిని, ప్రతి వ్యక్తిని నేరుగా లక్ష్యంగా చేసుకొని వారి అభ్యున్నతిపై దృష్టి సారించనున్నట్టు సీతారామన్ చెప్పారు.

గంభీరమైన వాగ్దాటితో కేంద్రం సాధించిన విజయాలను ఒకవైపు ఏకరువు పెడుతూనే -2047లో దేశం స్వాతంత్ర్య అమృతోత్సవం జరుపుకునే సమయానికి సంపన్న దేశాల సరసకు భారత్‌ను చేరుస్తామని ఉద్ఘాటించారు. దేశ దిశా గమనాన్ని ఉత్కృష్టస్థాయికి తీసుకెళ్లే ప్రయత్నంలో.. వికసిత భారత్ సాధనకు ప్రజలంతా కలిసి రావాలని పరోక్షంగా కోరారు. సంక్షిప్తంగా సాగిన సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో -పేదరిక నిర్మూలనకు బహుముఖీయ విధానాలతో కేంద్రం ఎలా పనిచేస్తుందో వివరించారు. అభ్యుదయ భారతదేశ నిర్మాణ బాధ్యతకు కేంద్రం కట్టుబడి ఉందని, 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్' అనే మంత్రంతో అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు వెళ్తున్నట్టు చెప్పారు.

### సమసమాజమే మా విజన్

కుల, మత, ఆర్థిక భేదాలు లేకుండా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే మోదీ ప్రభుత్వ విజన్‌గా ఆర్థిక మంత్రి ప్రకటించారు. ప్రధాని ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని పేదలు, మహిళలు, యువత, అన్నదాతలపై మరింత దృష్టి సారించనున్నామన్నారు. కేంద్రం ప్రాధాన్యతగావున్న ఈ నాలుగు వర్గాల అవసరాలు, ఆకాంక్షలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామని చెప్పారు.

### 'జీడీపీ'కి కొత్త నిర్వచనం..

జీడీపీ అంటే గవర్నెన్స్, డెవలప్‌మెంట్, పెర్ఫార్మెన్స్ అనే కొత్త అర్థాన్ని ప్రభుత్వం ఇచ్చిందని, ఆ దిశగా ప్రభుత్వం పట్టుదలతో పనిచేస్తుందని సీతారామన్ తెలిపారు. గత పదేళ్లలో సాధించిన విజయాలను ఏకరువు పెడుతూనే -రాబోయే కాలంగా సాధించాల్సిన, సాధించనున్న లక్ష్యాలను సీతారామన్ తమ బడ్జెట్ ప్రసంగంలో వివరించారు. ప్రభుత్వం గత పదేళ్లలో 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటకు తెచ్చినట్టు చెబుతూనే.. పంట బీమా పథకంతో నాలుగు కోట్లమంది రైతులు ప్రయోజనం పొందారన్నారు. పదేళ్లలో ద్రవ్యోల్బణాన్ని సమతుల్యంగా ఉంచామని, ఆర్థిక వృద్ధి పుంజుకుందనీ వివరించారు. పన్ను సంస్కరణలతో టాక్స్ బేస్‌ను విస్తరించగలిగిన కారణంగా, పన్ను వసూళ్లు పెరిగాయన్నారు. రానున్న ఐదేళ్లలో అసాధారణ రీతిలో ఆర్థిక వృద్ధి చోటుచేసుకోనుందని చెబుతూనే -2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. రక్షణ ప్రయోజనల రీత్యా డీప్ టెక్‌ను పటిష్టం చేసేందుకు కొత్త పథకాన్ని తెస్తున్నామని, మధ్యతరగతి ప్రజల సొంత ఇంటికలను సాకారం చేస్తామన్నారు. వచ్చే ఐదేళ్లలో పీఎం ఆవాస్ యోజన కింద 2 కోట్ల ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్టు చెప్పారు. స్వయం సహాయక బృందాల్లో కోటి మంది మహిళలు లక్షాధికారులు అయ్యారని వివరిస్తూనే- లక్ పతీ దీదీ టార్గెట్‌ను రెండునుంచి మూడు కోట్లకు పెంచుతున్నట్టు ప్రకటించారు.

### 25 కోట్లమంది పేదరికానికి దూరం

కేంద్రం అనుసరించిన ఆర్థిక విధానాలతో దేశంలో 25 కోట్లకుపైగా ప్రజలు బహుముఖ పేదరికం నుంచి బయటపడ్డారని సీతారామన్ వెల్లడించారు. పేదలకు సాధికారతకు తమ ప్రభుత్వంపై ప్రగాఢమైన విశ్వాసం ఉందంటూనే.. సబ్ కా సాథ్ సాధనతో పేదరికాన్ని పారదోలేందుకు ప్రభుత్వం 25 కోట్లమందికి సహాయం అందజేసిందన్నారు. గత పదేళ్ల కాలంలో సబ్‌కా సాథ్ ద్వారా పేదరికాన్ని భారీగా నిర్మూలించామన్నారు. గత దశాబ్ద కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ సానుకూల పరివర్తన చెందిందని, భవిష్యత్తుపై ఆశలు చిగురించాయని సీతారామన్ విశ్వాసం వ్యక్తం చేశారు. 2014లో దేశం పలు సవాళ్లను ఎదుర్కొందని, నరేంద్ర మోదీ సారథ్యంలోని ప్రభుత్వం వాటిని సమష్టి కృషి, సమ్మిళిత వృద్ధి (సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్) ద్వారా పరిష్కరించిందని అన్నారు.

### ఆదాయం పన్ను రేట్లు, శ్లాబుల్లో మార్పుల్లేవు

ఆదాయ పన్ను వర్గాలకు నిర్మలా సీతారామన్ తాత్కాలిక బడ్జెట్‌లో ఉపశమనం కలిగించే ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రస్తుత పన్ను విధానంలో ఎలాంటి మార్పులు లేవని తెలిపారు. గత ఏడాది ప్రతిపాదించిన కొత్త పన్ను విధానమే ఈసారి కూడా కొనసాగుతుందని, రూ.7 లక్షల వరకూ ఎలాంటి పన్ను భారం ఉండదని చెప్పారు. ప్రత్యక్ష, పరోక్ష, దిగుమతి సుంకాలకు పాత పన్ను విధానమే కొనసాగుతుందని తెలిపారు.

"గత పదేళ్లుగా ప్రత్యక్ష పన్నుల వసూళ్లు మూడు రెట్లు పెరిగింది. రిటర్న్ ఫైలర్స్ 2.4 రెట్లు పెరిగారు. పన్ను చెల్లింపుదారుల వాటాను దేశ సంక్షేమం, ప్రజల సంక్షేమానికి తెలివిగా ఖర్చుచేస్తామని వారికి హామీ ఇస్తున్నాను. పన్ను చెల్లింపుదారులు ఇస్తున్న మద్దతుకు అభినందిస్తున్నాను. ప్రభుత్వం పన్ను రేట్లను హేతుబద్ధం చేసింది. కొత్త పన్నుల పథకం కింద, రూ.7 లక్షల ఆదాయం వరకూ ఎలాంటి పన్ను ఉండదు.

ఇందుకు ఎలాంటి పొదుపు, పెట్టుబడులతో పని ఉండదు. అంతకుమించి ఆదాయం కలిగిన వారికి శ్లాబుల ప్రకారం పన్ను వర్తిస్తుంది. ప్రస్తుతం ఉన్న దేశవాళి కంపెనీల కార్పొరేట్ టాక్స్ రేటు 30 శాతం నుంచి 22 శాతం తగ్గించాం. నిర్దిష్టమైన కొత్త మ్యాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలకు పన్ను రేటు 15 శాతం చేశాం" అని నిర్మలా సీతారామన్ తెలిపారు.

అయితే ఒక కోటి మంది పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం కలిగించేలా సీతారామన్ కీలక ప్రకటన చేశారు. ఆర్థిక సంవత్సరం 2009-10కి సంబంధించిన వివాదాస్పద రూ.25 వేల ట్యాక్స్ డిమాండ్, 2010-11 నుంచి 2014-15 మధ్య రూ.10 వేలకు సంబంధించిన ట్యాక్స్ డిమాండ్ ఉపసంహరణకు ప్రతిపాదన చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ నిర్ణయం దాదాపు 1 కోటి మంది పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం చేకూర్చనుంది.

## వరుసగా ఆరుసార్లు..

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ .. నరేంద్ర మోదీ ప్రభుత్వ చివరి బడ్జెట్‌ను గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌తో వరుసగా ఆరుసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టి మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ సరసన నిలిచారు. గతంలో ఆర్థిక మంత్రులుగా చేసిన మన్మోహన్ సింగ్, అరుణ్ జైట్లీ, పి.చిదంబరం, యశ్వంత్ సిన్హాల ఐదు బడ్జెట్‌ల రికార్డును ఆమె అధిగమించారు. 58 నిమిమిషాల పాటు బడ్జెట్ ప్రసంగం కొనసాగించారు. ఇంతవరకూ ఆమె ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లతో పోల్చుకుంటే అత్యంత తక్కువ సమయంలో బడ్జెట్ ప్రసంగం ముగించడం ఇదే ప్రథమం. నిర్మలా సీతారామన్ గత ప్రసంగాలను పరిశీలిస్తే, 2019లో 137 నిమిషాల పాటు ఆమె బడ్జెట్ ప్రసంగం సాగించారు. 2020లో 162 నిమిషాల పాటు సుదీర్ఘంగా ప్రసంగించారు. 2021లో 110 నిమిషాలు, 2022లో 92 నిమిషాలు ప్రసంగించారు. 2023లో 87 నిమిషాల పాటు ఆమె ప్రసంగం సాగింది. ఈసారి (2024) మధ్యంతర బడ్జెట్ కావడంతో 58 నిమిషాలతో ప్రసంగం ముగిసింది. 2019 జూలై నుంచి ఐదుసార్లు పూర్తి బడ్జెట్‌ను నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఇప్పుడు ఆరోసారి పెట్టింది మధ్యంతర బడ్జెట్.















చైతన్యరథం

పుణ్యభూమి నా దేశం నమో నమామి

## సంపాదకీయం

# ఓటు... మన హక్కు

ఓటు -పరిపాలన విధానానికి ఆయుధం. ప్రజాస్వామ్యానికి దిక్సూచి.కుల, మత, ప్రాంత,లింగ, జాతి,భాష అనే భేదం లేకుండా దేశంలో నివసించే 18 ఏళ్లు నిండిన పౌరులందరికీ భారత రాజ్యాంగం ఆర్టికల్ 326 ప్రకారం ఓటు హక్కు కల్పించింది. ఇలాంటి విషయాలు మాట్లాడుకోవడానికి ఉదాత్తంగా ఉంటాయి. ఆచరణలో, క్షేత్రస్థాయిలో భిన్న పరిస్థితులు ఎదురుకావొచ్చు. వాటిని పరిష్కరించుకోవడంలోనే మనం చూపించే ఉదాత్తతను తూకంవేసి చూడాలి.

కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటర్ల తుది జాబితా తప్పుల తడక అన్నది రాష్ట్రంలో గట్టిగా వినిపిస్తున్న మాట. దీనికి ముందు-అధికారంలోవున్న జగన్‌రెడ్డి తన రాజకీయ ప్రయోజనాల కోసం కుట్రపన్ని 14లక్షల ఓట్లు తొలగించాడన్న అంశం రాష్ట్రంలో రచ్చకు దారితీసింది. ఓటు హక్కును తొలగిస్తూ వైసీపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందంటూ ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం సహా రాజకీయ పార్టీలు, సామాజిక సంఘాలు పెద్దఎత్తున పోరుకు దిగాయి. ముఖ్యంగా ప్రతిపక్షాల మద్దతుదారుల ఓట్లు తొలగించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనంటూ పోరు మొదలైంది. ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులు ఓట్లు తొలగించేందుకు తప్పుడు వివరాలతో ఫాం-7 దరఖాస్తులు పెట్టే కుట్రను జగన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా వ్యవస్థీకృతం చేశాడంటూ ఎన్నికల సంఘానికి పుంఖాను పుంఖాలుగా ఫిర్యాదులు వెళ్లాయి. ఎన్నికల సంఘం సైతం.. విస్తృత చర్యలు చేపట్టినట్లు కనిపించింది. దీంతో తుది జాబితా అయినా పారదర్శకంగా ఉంటుందని ప్రతిపక్షాలు భావించాయి. అయితే ఓటర్ల తుదిజాబితా చూసి ఖంగుతిన్నాయి. ఎన్నికల సంఘం అధికారుల చర్యలు-అధికార పక్షంఅక్రమాలను సమర్థించినట్టే ఉంది. జగన్ కుట్రలను ఎన్నికల సంఘం గుర్తించకపోవడం బాధాకరం. ఎన్నికల సంఘం నిర్లక్ష్య చర్య -ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టంటూ విపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి.

ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలే కాదు. ఎన్నికల ప్రక్రియ ప్రజాస్వామ్యంలో ఓ భాగం. ఒకరిని కొనసాగించటం లేదా ఒకరిని గద్దె దించటం.. రాజ్యాంగబద్ధంగా ప్రజలకు సంక్రమించిన హక్కు. ఆ హక్కే -ఓటు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లడానికి ప్రతి ఒక్కరి ఓటూ కీలకమన్న స్పృహ ఓటర్లలో ఉండాలి. అది లేనపుడే-ఇలాంటి నైరాశ్యం అలముకుంటుంది. లేదంటే -గత కొద్దిరోజులుగా.. గత కొన్ని నెలలుగా అధికారపక్షం ప్రణాళికాబద్ధంగా అనైతిక ఓటు రాజకీయం నెరపుతున్నా -రాష్ట్రంలో పౌర సమాజం విపక్షాలకు మద్దతు పలకలేకపోయింది. 'నా ఓటు నా హక్కు' అంటూ ఎలుగెత్తి చాటి పౌర సమాజం క్రియాశీలకంగా వ్యవహరించి ఉండివుంటే-ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడివుండేది కాదు.

నియంత పాలనతో ప్రజలు విసిగిపోయారన్న వాస్తవాన్ని ముందే గ్రహించింది అధికార వైసీపీ. అంతకుముందు వరకూ.. తమ నాయకుడి సత్పరిపాలన, అతని అరివీర భయంకర ఉద్యమత్వానికి ముగ్ధులై జనం మరొక్కసారి తమ పార్టీకి మీట నొక్కుతారని భావించింది. వాస్తవాలు గ్రహింపునకు వచ్చాక వైసీపీ గెలుపు ధైర్యం ఆవిరైంది. మళ్లీ అధికారంలోకి రావాలంటే దానిముందు రెండే మార్గాలు. రాష్ట్రంలో తమ ఓటుశాతం పెంచుకోవటం, ప్రత్యర్థుల ఓటుశాతం తుంచటం. నిజాయితీగా ఈ రెండూ సాధ్యం కాదు. అందుకే అన్నిటికీ సిద్ధపడిన వైసీపీ -అనైతిక ఓటు ప్రహసనానికి తెరలేపింది. మరోపక్క -రాష్ట్ర ప్రజలు మొత్తం ప్రధాన విపక్షంవైపు చూడటాన్నీ సహించలేకపోయింది. ప్రజలు ఓట్లేస్తేనే గెలవడమేంటి? నెగ్గాలనుకున్నపుడు సరిపడా ఓట్లు మనమే వేసేసుకుంటే పోలా? అన్న ఆలోచనతో దొంగ ఓట్ల చేర్పు కుట్రకు పన్నాగం పన్నింది. అంటే-ఈ ప్రభుత్వాన్ని మేమే ఎంపిక చేసుకున్నాము అన్న ఆత్మసంతృప్తి కూడా ఓటర్లకు మిగల్చని దారుణానికి ఒడిగట్టింది.

ఒకే పక్షం నిరంతరం పాలించకుండా మార్పును కోరుకోవడం ప్రజాస్వామిక హక్కు. ప్రజల చేతిలో మార్పు ఆయుధం ఉన్నదన్న భయం పాలకుల్లో ఉండాలంటే ఓటును -హక్కుగా ప్రయోగించాలి. ఏ పార్టీ గెలుపు వల్ల, ఏ అభ్యర్థి గెలుపు వల్ల స్వేచ్ఛ, నిర్ణయాధికారం, ఎక్కువ అభివృద్ధి, తక్కువ హాని, తక్కువ హింస జరుగుతాయో తెలుసుకుని అందుకు తగ్గ ఎంపిక చేసుకోవాలంటే -మన ఓటే కాదు, రాష్ట్రంలోని ప్రతి ఓటూ స్వచ్ఛంగా ఉండాలి. అంతకుముందు -ఎవరి ఓటు వాళ్ల దగ్గరుండాలి. ఓటు హక్కుతో పోరాడి రాజులవుతారో, అమ్ముడుపోయి బానిసలవుతారో.. మీ నిర్ణయంపైనే ఆధారపడి ఉంది -అంటాడు అంబేద్కర్. ఆయన ఆకాంక్ష సాక్షాత్కరించాలంటే -అక్రమదారుల్లో సాగిస్తోన్న అధికారపక్ష ఓటు దాటుపై సభ్య సమాజ ఉద్యమించడం ఒక్కటే మార్గం. ఎవరి ఓటు ఎలా పోతే మనకెందుకులే అని చైతన్యరహితులుగా ఉండిపోతే -ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన పాతకం ప్రతి పౌరుడికీ చుట్టుకోక పోదు.

## మాటకు మాట



**జగన్ చెప్పాడంటే..**
**చేస్తాడంతే.**

- మంత్రి జోగి రమేష్



**కామన్ మ్యాన్:**

అంతకుమించి ఏమైనావుంటే చెప్పు బాసూ. పాడిందే పాడర పాచిపళ్ల దాసరి అన్నట్టు -నాలుగేళ్ళుగా అదే అరిగిపోయిన గ్రామ్‌ఫోన్ రికార్డు రాష్ట్రం మొత్తం వినిపిస్తున్నారు. జగన్ సంగతి అలావుంచు -నువ్వు మంత్రివి కదా. అసలు నీ శాఖేంటో నీకు తెలుసా? దానిగురించి ఎన్నిసార్లు మాట్లాడావు, జగన్ భజనెన్నిసార్లు చేశావో కరెక్ట్‌గా చెప్పు.

మనలో మనమాట. జగన్ చెప్పకుండా కూడా చాలా చేస్తాడు బాసూ. తల్లినీ చెల్లినీ తరిమేశాడా? చెత్తపన్ను నెతినేసేడా? విద్యుత్ షాకిలిచ్చాడా? మద్యనిషేధాన్ని మందులో ముంచేశాడా? జనం చేత విషం తాగించాడు. సిట్టింగుల్ని పీకెయ్యడం, ఎంపీల్ని మార్చేయడం.. ఇవన్నీ చెప్పి చేశాడాయేంటి? సో, పనికొచ్చేది చేయడు. పనికిరాని సొల్లు చెప్తాడు. తెలిసిందే కదు బాసూ..!!

# బడ్జెట్ 2024 ఎవరికి లాభం.. ఎవరికి నష్టం?



మధ్యంతర బడ్జెట్‌ను కేంద్రఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రైతులను, పేదలను ఊరించారు. ద్రవ్యలోటును నియంత్రిస్తూనే సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారు.మౌలిక వసతులు, విద్యుత్ వాహనాలు, ఆభరణాలు వంటి రంగాలపై సీత కన్నేశారు.

### ఈ రంగాలకు మేలు

#### వ్యవసాయరంగం

ఈసారి వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. పంట చేతికొచ్చిన తర్వాత చేపట్టబోయే పనులకు సంబంధించి ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యాలపై పెద్ద ఎత్తున ప్రణాళికలను రూపొందించనున్నారు. ఇందుకు గాను ఆధునీక స్టోరేజీ సౌకర్యాలు, సప్లయి చైన్‌లను ఏర్పాటు చేయనున్నారు. దీనితోపాటు నూనె గింజల ఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించేలా, పాడీ రైతులకు మరింత లాభాలు తెచ్చేందుకు ప్రత్యేక కార్యక్రమానికి ప్రణాళిక రూపొందించారు. అలాగే మత్స్య రంగంలో ఉత్పాదకతను పెంచేందుకు ఆ రంగంపై ఎక్కువ ఖర్చు చేయనున్నారు.

#### మధ్య తరగతి

మధ్యతరగతి ప్రజలకు చేతిలో డబ్బులు ఉండేలా, వారు స్వంత అవసరాలకు ఖర్చు చేసుకునేలా పన్నుల శ్లాబ్‌రేట్లలో మార్పులు తెచ్చారు. అదే విధంగా అద్దె ఇళ్లల్లో, స్లమ్‌లలో ఉండేవారికి ఉపయోగపడేలా, వారు సొంత ఇళ్లు కట్టుకునేలా గృహ నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు.

#### పర్యాటక రంగం

రాష్ట్ర ప్రభుత్వాలు పర్యాటక కేంద్రాలను ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేసేలా కేంద్రం సహకారం అందిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలకు పర్యాటక రంగ అభివృద్ధి కోసం వడ్డీ రహిత దీర్ఘకాలిక రుణాలను కూడా అందిస్తుంది.

#### పునరుత్పాదక శక్తి

ఒక గిగావాట్ లక్ష్యానికి అనుగుణంగా అభివృద్ధి జరగని వాయు విద్యుచ్ఛక్తి రంగాన్ని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తోంది. ఈ నిధుల ద్వారా ఈ రంగంలో అభివృద్ధి అధికంగా చోటు చేసుకునే అవకాశముంది.

### ఈ రంగాలకు నిరాశ

#### మౌలిక వసతులు

రోడ్లు, పోర్టులు, విమానాశ్రయాలు లాంటి మౌలిక వసుతల కల్పనకు ఈ బడ్జెట్‌లో 11.11 లక్షల కోట్లను కేటాయించారు. గత ఏడాది బడ్జెట్ కంటే 11.11 శాతం అదనంగా కేటాయించారు. అయితే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఈ రంగంలో మరింత అభివృద్ధి కోసం ఈ కేటాయింపులు సరిపోవని నిపుణులు అంటున్నారు.

#### విద్యుత్ వాహనాలు

విద్యుత్ వాహనాల వినియోగం పెంచాలని, అందుకావాల్సిన మౌలిక వసుతులైన బ్యాటరీ ఛార్జింగ్ స్టేషన్లను నెలకొల్పాలని భారత ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఈ మార్చితో విద్యుత్ వాహనాలకు ఇచ్చే సబ్సిడీ పథకం ముగిసిపోతుండగా ఈ బడ్జెట్‌లో మాత్రం దాన్ని కొనసాగించలేదు.

#### ఆభరణాలు

ఆభరణాలపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం అత్యధికంగా దిగుమతి సంకాన్ని 15 శాతంగా విధిస్తోంది. ఈ రంగంలో ఉన్న ప్రముఖ కంపెనీలు ఈ పన్నును తగ్గిస్తారని ఆశించగా ఈ బడ్జెట్‌లో అటువంటిదేమీ జరగలేదు.

#### పెట్టుబడుల ఉపసంహరణ

వేగంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ జరగాలని ప్రభుత్వం కోరుకున్నప్పటికీ ఈ ఏడాదిలో ఆ విధంగా జరగలేదు. 51 వేల కోట్ల రూపాయలను పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యంగా పెట్టుకోగా కొన్ని పెద్ద సంస్థల్లో ఈ కార్యక్రమం సక్రమంగా సాగక పోవడంతో మార్చి నాటికి 30 వేల కోట్ల రూపాయలు మాత్రమే వచ్చే అవకాశముంది. కాగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి 50 వేల కోట్ల రూపాయలను టార్గెట్‌గా పెట్టుకున్నారు.

## కుక్క కాటు... చెప్పు దెబ్బ

**నీలివార్త** అగ్రవర్ణ అభ్యర్థులు గెలిచిన మంగళగిరిలో బీసీ అభ్యర్థి గంజి చిరంజీవిని జగన్ నిలబెట్టారు.

**మంగళగిరి అని స్పష్టంగా పలకటం రాని లోకేష్‌కి పోటీ ఎందుకని మంత్రి జోగీ రమేష్ ఎద్దేవా**

### నిప్పులాంటి నిజం



- లోకేష్ గెలిస్తే మంగళగిరి ఆంధ్రా సైబరాబాద్ అవుతుంది. మంగళగిరి నియోజకవర్గ బీసీ బిడ్డలందరూ ఇక్కడే పెద్ద ఉద్యోగాలు పొందుతారు. బీసీల వ్యాపారాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి అవుతాయి. బీసీల భూముల విలువ బంగారమౌతుంది.
- గంజికి చోటిస్తే మంగళగిరి బీసీల భూములు వైకాపావారి కబ్జాల పాలౌతాయి. మంగళగిరి బీసీల భూముల విలువ పడిపోతుంది. బీసీల వ్యాపారాలు దెబ్బతింటాయి.
- బీసీల బాంధవులు ఎన్‌టిఆర్, చంద్రన్న, లోకేష్‌లేగాని జగన్, గంజి, జోగి కాదు. వారు విపరీతమైన వ్యక్తిగత స్వార్థపరులు మాత్రమే.
- జగన్‌రెడ్డి పాలనలో 300 మందికి పైగా బీసీలు హత్యచేయబడ్డారు.
- బీసీ రిజర్వేషన్లు పది శాతం కోసి.. స్థానిక సంస్థల్లో 16వేల రాజ్యాంగబద్ధ పదవుల్ని బీసీలకు దూరం చేసి జగన్‌రెడ్డి సామాజిక న్యాయం గొంతుకోస్తుంటే -మంత్రి జోగి ఏం పీకుతున్నారు?
- బీసీ భవనాలు, ఆదరణ, విదేశీవిద్య లాంటి చంద్రన్న ఇచ్చిన 30 సంక్షేమ పథకాల్ని జగన్ రద్దు చేస్తే జోగి ఎక్కడ తొంగున్నారు?
- రూ. 75వేల కోట్లు బీసీ సబ్ ప్లాన్ నిధులు జగన్ దారి మళ్లిస్తే.. జోగి నోరేమైంది?
- తన వ్యక్తిగత స్వార్థం కోసం జోగి.. బీసీ సామాజిక వర్గాన్నంతా జగన్ అణచివేతకు బలిపెట్టారు. జోగి, గంజి చిరంజీవి వ్యక్తిగత స్వార్థం కోసం బీసీ ద్రోహి జగన్‌కు గులాంలేగాని బీసీల ప్రతినిధులు కారు. -వీరు కుల ద్రోహులు కూడానూ.
- లోకేష్ విదేశాల్లో పెద్ద చదువులు చదివారు. అయినా తక్కువ కాలంలోనే తెలుగులో అద్భుతంగా మాట్లాడే స్థాయికి ఎదిగారు.
- జగన్ అరకొర చదువులు ఇక్కడే చదివారు. అయినా ఆయన ఉపన్యాసాల్లో ఎన్నెన్నో తప్పులు.. క్రింది విధంగా ఉన్నాయి.

- నియామకం బదులు నియాకం.
- సామాజిక అభద్రత బదులుసామాజిక అభ్ర
- ప్రతి పథకం బదులు ప్రతి ప్రతకం
- ఆర్థికంగా బదులు హార్ధికంగా..

ఇలా జగన్ ప్రసంగాల్లో ఎన్నో అపశ్రుతులు ప్రజలు చూస్తున్నారు. తన లక్షణాన్ని ఎదుటివారికి అంటగట్టి చెప్పిన అబద్ధమే వందసార్లు చెప్పడం జగన్‌రెడ్డి నైజం.

# కంటిరెప్పల్లా కాపాడుకుంటాం

- కార్యకర్తల కుటుంబాలకు భువనేశ్వరి పరామర్శ
- ఒక్కో కుటుంబానికి రూ.3లక్షలు ఆర్థికసాయం

## అధైర్య పడొద్దు... మీతో మేముంటాం



నెల్లూరు: తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుతో మనస్తాపానికి గురై చనిపోయిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన ఆయన సతీమణి భువనేశ్వరి.. "మేమున్నాం..అధైర్యపడొద్దు" అని ధైర్యం చెప్పారు. నిజం గెలవాలి కార్యక్రమం కందుకూరు, ఉదయగిరి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో గురువారం జరిగింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో కలత చెంది గుండె పగిలి చనిపోయిన కార్యకర్తల కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించారు. కందుకూరు ఆలా వారి కళ్యాణమండపం వద్ద విడిది కేంద్రం నుండి ప్రారంభమైన భువనేశ్వరి మొదటగా కందుకూరు నియోజకవర్గం, గుడ్లూరు మండలం గుడ్లూరు గ్రామంలో పార్టీ కార్యకర్త కర్పూరపు సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని పరామర్శించారు. సుబ్రహ్మణ్యం(49), గత ఏడాది అక్టోబర్ 19న గుండెపోటుతో మృతిచెందారు. సుబ్రహ్మణ్యం భార్య రమాదేవి, కుమారుడు బ్రహ్మయ్యలను భువనేశ్వరి ఓదార్చి, ధైర్యం చెప్పారు. సుబ్రహ్మణ్యం కుటుంబానికి రూ.3లక్షల చెక్కు అందించి ఆర్థికసాయం చేశారు. అనంతరం గుడ్లూరు గ్రామంలో మరో కార్యకర్త పువ్వాడి చినవెంకయ్య కుటుంబాన్ని పరామర్శించారు. చినవెంకయ్య(80), గత ఏడాది అక్టోబర్ 13న గుండెపోటుతో మృతిచెందారు. చినవెంకయ్య కుమారుడు వేణుగోపాల్, కుమార్తె పద్మావతిలను భువనేశ్వరి పరామర్శించి, ధైర్యం చెప్పారు. చినవెంకయ్య కుటుంబానికి రూ.3లక్షలు ఆర్థికసాయం అందించారు. అనంతరం గుడ్లూరు మండలం, దార్కానిపాడు గ్రామంలో పార్టీ కార్యకరర్త దగ్గుమాటి వెంకటేశ్వర్లు కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. వెంకటేశ్వర్లు(47), గత ఏడాది సెప్టెంబర్ 15న గుండెపోటుతో మృతిచెందారు. వెంకటేశ్వర్లు భార్య కోటేశ్వరమ్మ, కుమారులు వంశీ, కిషోర్ లను భువనేశ్వరి ఓదార్చి, ధైర్యం చెప్పారు. వెంకటేశ్వర్లు కుటుంబానికి రూ.3లక్షలు ఆర్థికసాయం అందించారు. అనంతరం ఉదయగిరి నియోజకవర్గం, కొమ్మి గ్రామంలో పార్టీ కార్యకర్త తాటిపర్తి సుధాకర్ కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. సుధాకర్(55), గత ఏడాది సెప్టెంబర్ 14న గుండెపోటుతో మృతిచెందారు. సుధాకర్ భార్య ఎంగమ్మ, కుమారుడు మధు, కుమార్తెలు మనోజ్, ఝాన్సీలను ఓదార్చి ధైర్యం చెప్పారు. సుధాకర్ కుటుంబానికి రూ.3లక్షల చెక్కు ఇచ్చి ఆర్థికసాయం అందించారు. అనంతరం నెల్లూరు రూరల్ నియోజకవర్గం, నెల్లూరు 29వ వార్డులోని పార్టీ కార్యకర్త రేగల వెంకయ్య కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. వెంకయ్య(72), గత ఏడాది సెప్టెంబర్ 21న గుండెపోటుతో మృతిచెందారు. వెంకయ్య భార్య లక్ష్మీదేవమ్మ, కుమారులు శ్రీనివాస్, అమరావతి, కుమార్తె మల్లీశ్వరిలను భువనేశ్వరి ఓదార్చి, ధైర్యం చెప్పారు. వెంకయ్య కుటుంబానికి రూ.3లక్షల చెక్కు ఇచ్చి ఆర్థికసాయం చేశారు. అనంతరం నెల్లూరు 41వ డివిజన్ లో పార్టీ కార్యకర్త పూల సుబ్బారావు కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. సుబ్బారావు(72), గత ఏడాది అక్టోబర్ 4న గుండెపోటుతో మృతిచెందారు. సుబ్బారావు కుమారుడు సుబ్రహ్మణ్యం, కుమార్తెలు ఆదిశేషమ్మ, సావిత్రిలను భువనేశ్వరి ఓదార్చి ధైర్యం చెప్పారు. సుబ్బారావు కుటుంబానికి రూ.3లక్షలు ఆర్థికసాయం అందించారు.





**నేటి కార్యక్రమ వివరాలు:**

2వ తేదీ ఉదయం 9:00 గంటలకు - నెల్లూరు రూరల్ నియోజకవర్గం, కస్తూరి గార్డెన్స్ విడిది కేంద్రం నుండి ప్రారంభం.

10:20 - అత్మకూరు నియోజకవర్గం, ఆత్మకూరు మండలం, అల్లిపురం గ్రామంలో బాధిత కుటుంబానికి పరామర్శ.

11:55 - వెంకటగిరి నియోజకవర్గం, మండల కేంద్రమైన కలువాయిలో బాధిత కుటుంబానికి పరామర్శ.

మధ్యాహ్నం 12:20 - కల్లూరు గ్రామంలో భోజన విరామం.

2:05 - వెంకటగిరి నియోజకవర్గం, రాపూరు మండలం, శానాయపాలెం గ్రామంలో బాధిత కుటుంబానికి పరామర్శ.

3:50 - రేణిగుంట విమానాశ్రయం నుండి హైదరాబాద్‌కు తిరుగు పయనం.









చైతన్యరథం

# మహిళా పక్షపాతి చంద్రబాబు

- ఆడబిడ్డల రక్షణ, సంక్షేమమే ధ్యేయం
- ఆర్థిక స్వావలంబన కల్పించే దిశగా కృషి
- కొమ్మి గ్రామంలో మహిళలతో భువనేశ్వరి మాటామంతి



ఉదయగిరి: మహిళలకు రక్షణ, సంక్షేమం, ఆర్థిక బలం చేకూర్చడమే ధ్యేయంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పనిచేశారని ఆయన సతీమణి భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి పర్యటనలో భాగంగా నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం కొమ్మి గ్రామంలో కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన భువనేశ్వరిని చూసేందుకు మహిళలు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. భువనేశ్వరితో మాట్లాడేందుకు, కరచాలనం చేసేందుకు మహిళలు పోటీలు పడ్డారు. మహిళలనుద్దేశించి భువనేశ్వరి మాట్లాడుతూ టీడీపీ పాలనలో మహిళలకు ఏ కష్టం వచ్చినా చంద్రబాబు వెంటనే స్పందించి దోషులను కఠినంగా శిక్షించేవారు..మహిళలకు న్యాయం చేకూర్చేవారన్నారు. మహిళలకు అనేక సంక్షేమ పథకాలను తెచ్చి, వారికి ఆర్థిక శక్తిని ఇచ్చిన వ్యక్తి చంద్రబాబు. వైసీపీ పాలనలో మహిళలకు రక్షణ పూర్తిగా కరువైంది. మహిళలపై అఘాయిత్యాల్లో దేశంలోనే మొదటిస్థానంలో నిలిచేలా ప్రస్తుత పాలకులు రాష్ట్రాన్ని నాశనం చేశారని భువనేశ్వరి విమర్శించారు.

## మహిళల కోసం ప్రత్యేక మ్యానిఫెస్టో

మహిళల పక్షపాతి చంద్రబాబును వైసీపీ ప్రభుత్వం కుట్రపూరితంగా జైలుకు పంపిందనే విషయం ప్రపంచమంతా తెలుసు...ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వైసీపీ పాలనలో మహిళలు అన్ని రంగాల్లో వెనుకబడిపోయారు. మహిళలను అన్ని విధాలా ఆదుకోవాలనే దృఢమైన సంకల్పంతో చంద్రబాబు పనిచేస్తున్నారు. అందుకే మహిళల కోసం ప్రత్యేక మ్యానిఫెస్టోను ప్రకటించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే మహిళలకు ఆడబిడ్డ నిధి పథకం ద్వారా 18 సంవత్సరాల నుండి 59 ఏళ్ల వయసు లోపు మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18వేలు ఇవ్వబోతున్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అంతమందికి ఒక్కొక్కరికి నెలకు రూ.15,000 తల్లి ఖాతాలో వేయబోతున్నారు. దీపం పథకం ద్వారా పేదవారికి సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వబోతున్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం సౌకర్యం కల్పించబోతున్నారు...ఈ పథకాన్ని మహిళలు దుర్వినియోగం చేయొద్దని నా మనవి. వైసీపీ పాలనలో చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులుగా రోడ్లపై తిరగాల్సిన దుస్థితి వచ్చింది. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు వస్తాయి. రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుంది. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుని అన్ని రంగాల్లో వెనుకబడిపోయిన మన రాష్ట్రాన్ని మనం కాపాడుకోవాలి. మహిళలంతా ఏకమై చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కృషి చేయాలని భువనేశ్వరి పిలుపు ఇచ్చారు.

## కార్యకర్తలు మా బిడ్డల్లాంటి వారు

చంద్రబాబు కుటుంబం కంటే రాష్ట్ర సంక్షేమం కోసం ఎక్కువ సమయాన్ని, ఆయన జీవితాన్ని వెచ్చించారనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుపెట్టుకోవాలి. పార్టీ కార్యకర్తలు మా బిడ్డల్లాంటి వారు. చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో వారు మనస్తాపానికి గురై ప్రాణాలు విడిచారు...నాకు చాలా బాధగా ఉంది. మా బిడ్డల కుటుంబాలను నేరుగా కలిసి, పరామర్శించి, ధైర్యం చెప్పి వారికి అండగా నిలబడేందుకు నేను వచ్చాను. నాకు అడుగడుగునా సంఘీభావం తెలుపుతూ..అండగా నిలబడుతున్న మహిళల ప్రేమాభిమానాలకు నా నిండు కృతజ్ఞతలు...ధన్యవాదాలు. మీ ఆదరాభిమానాలు చేశాక మహిళలందరూ టీడీపీతో, చంద్రబాబుతో ఉన్నారనే దృఢమైన నమ్మకం తనకు ఏర్పడిందని భువనేశ్వరి అన్నారు.







## జొన్నాడ మల్లికార్జునస్వామి, కామాక్షిదేవిని దర్శించుకున్న భువనేశ్వరి

నిజం గెలవాలి నెల్లూరు రూరల్ నియోజకవర్గ పర్యటన పూర్తయిన తర్వాత నారా భువనేశ్వరి జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షిదేవి ఆలయానికి వెళ్లారు. ఆలయ పండితులు, అధికారులు భువనేశ్వరికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ భువనేశ్వరికి ఆలయంలోకి స్వాగతం పలికారు. ఆలయంలో కొలువుదీరిన శ్రీ లక్ష్మీగణపతిస్వామి, శ్రీ మల్లికార్జునస్వామి, శ్రీ వల్లీదేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీ కామాక్షి అమ్మవారు, శ్రీ ఆదిశంకరాచార్యలను దర్శించుకుని భువనేశ్వరి ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం భువనేశ్వరికి ఆలయ పండితులు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. దేవస్థానం చైర్మన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ విరూపవరుల గిరికృష్ణ భువనేశ్వరికి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు.













చైతన్యరథం

# శ్రీశైలంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న లోకేష్ దంపతులు



శ్రీశైల భ్రమరాంబిక అమ్మవారు, మల్లికార్జునస్వామి వారిని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనతో పాటు ఆయన సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్‌కు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం లోకేష్ దంపతులు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు వారికి వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు బహూకరించారు. అంతకుముందు సాక్షి గణపతి ఆలయాన్ని, వీరభద్ర స్వామి ఆలయాన్ని లోకేష్ దంపతులు దర్శించుకున్నారు. సాక్షి గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.





















# 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

- మౌలిక రంగానికి, స్కిల్ ఇండియాకు కేంద్ర తోడ్పాటును స్వాగతిస్తున్నాం
- విభజనచట్టం హామీల అమలుకు నిధులు సాధించడంలో జగన్ మరోమారు విఫలం
- వైకాపాకు 31 మంది ఎంపీలు ఉన్నా ఉపయోగం శూన్యం
- బడ్జెట్‌పై అచ్చెన్నాయుడి స్పందన

అమరావతి: స్వాతంత్ర్యం సాధించి వందేళ్లు పూర్తి చేసుకునే సమయానికి 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేలా కేంద్ర బడ్జెట్ ఉందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు అన్నారు. బడ్జెట్ నిర్ణయాలు ఆ లక్ష్యసాధన దిశగా ఉన్నాయని ఆయన కొనియాడారు. మౌలిక రంగానికి, యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వడం మంచి పరిణామమని అచ్చెన్న అన్నారు. దేశ గతిని మార్చే మౌలిక రంగానికి రూ. 11 లక్షల కోట్లు కేటాయించడంతో పాటు 1.40 కోట్ల మంది యువతకు స్కిల్ ఇండియా మిషన్ కార్యక్రమాన్ని అమలు చేయాలనుకోవడం హర్షణీయమన్నారు. 2014 - 2019 మధ్య కాలంలో నైపుణ్య శిక్షణ ద్వారా ఉద్యోగాల కల్పనలో చంద్రబాబు పాలనలోని ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

2024లో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి 10 ఏళ్ల కాలపరిమితి ముగుస్తున్నా రాష్ట్రానికి నిధుల సాధనలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని విమర్శించారు. గత 5 ఏళ్లలో వైసీపీ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రం అన్ని రంగాల్లో తీవ్రంగా నష్టపోయింది. 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని చెప్పిన జగన్ రెడ్డి 31 మంది ఎంపీలను పెట్టుకుని రాష్ట్రానికి ఏం తెచ్చారో చెప్పాలి. విభజన చట్టంలో కేటాయించిన 11 జాతీయ విద్యా సంస్థలను తెలుగుదేశం ప్రభుత్వం తీసుకొస్తే వాటికి నిధులు కూడా తేలేకపోవడం జగన్ రెడ్డి వైఫల్యం కాదా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రాయోజిక పథకాలకు రాష్ట్ర వాటా నిధులు కూడా ఇవ్వలేక వేల కోట్ల కేంద్ర నిధులను నిరుపయోగం చేయడం తప్ప జగన్ రెడ్డి చేసింది శూన్యమని అచ్చెన్నాయుడు దుయ్యబట్టారు.



## ఓటర్ల తుది జాబితాలోనూ అనేక తప్పులు

### తక్షణం సరిదిద్దాలని కేంద్ర ఎన్నికల సంఘానికి వర్ల రామయ్య లేఖలు

అమరావతి: ఓటర్ల తుది జాబితాలో కూడా అనేక తప్పులు వచ్చాయని, వాటిని సరిదిద్దాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య కోరారు. తుది ఓటర్ల జాబితాలో వచ్చిన తప్పులపై వివిధ పత్రికల్లో వచ్చిన వార్తా కథనాలను ప్రస్తావిస్తూ కేంద్ర ఎన్నికల సంఘానికి వర్ల మూడు లేఖలు రాశారు. వివిధ వార్తా పత్రికల్లో ప్రచురితమైన వార్తా కథనాల క్లిప్పింగులను కూడా లేఖలకు జత చేశారు. నెల్లూరు, మైలవరం, చిత్తూరు, ఎచ్చెర్ల, చంద్రగిరి, పొన్నూరు, విజయవాడ తూర్పు, పలమనేరు, పొన్నూరు, విశాఖపట్నం, నర్సరావుపేట, పెద్దాపురం, చోడవరం అసెంబ్లీ నియోజకవర్గాలలోని ఓటర్ల జాబితాల్లో తప్పులు వచ్చాయని పేర్కొంటూ వాటిని సరిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. నెల్లూరులో 17 ఏళ్ల బాలుడికి సైతం ఓటు హక్కు కల్పించారు. మైలవరం నియోజకవర్గంలో వలసవెళ్లిన వారి ఓట్లను తొలగించలేదు. చిత్తూరు, పులిచర్లలో చనిపోయిన వారి ఓట్లు జాబితా నుంచి తొలగించలేదు. పలమనేరులో తెలుగుదేశం సానుభూతిపరుల ఓట్లు తొలగించారు. పుత్తూరులో కేవలం 'ఛ' అనే అక్షరంకు ఓటు హక్కు కల్పించారు. పుంగనూరులో మృతులకు సైతం ఓటు హక్కు కల్పించారు. ఎచ్చెర్లలో కేవలం ఒకే భవనంలో 250 మంది నివాసం ఉంటున్నట్లు ఓటు హక్కు కల్పించారు. చంద్రగిరిలో పోలింగ్ స్టేషన్ 322 లో దాదాపు 44 మంది ఓట్లు గుర్తించడమే కష్టంగా ఉంది. వివిధ నియోజక వర్గాలలో గుర్తించలేని అనేక ఓట్లు తుది జాబితాలో దర్శనమిస్తున్నాయి. ఈ తప్పులను వెంటనే సరిదిద్దాలని వర్ల రామయ్య కోరారు.



## ఏపీలో సలహాదారులపై వ్యయం రూ.680 కోట్లు

### - వారి సేవలు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో సీఎం చెప్పాలని నాదెండ్ల డిమాండ్

### - కేంద్ర బడ్జెట్‌ను స్వాగతిస్తున్నామని వ్యాఖ్య



విజయవాడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌ను స్వాగతిస్తున్నట్లు జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. దేశవ్యాప్తంగా 81 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇవ్వడం గొప్ప విషయమని... దీన్ని 2029 వరకు పొడిగించడం అభినందనీయమన్నారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే విధంగా కేంద్రం చర్యలు తీసుకుంటోందన్నార. అన్ని ముఖ్య పట్టణాలకు మెట్రో సర్వీసులు విస్తరించాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాదెండ్ల మాట్లాడుతూ రాష్ట్రంలో సలహాదారుల వ్యవస్థపై విమర్శలు గుప్పించారు.

సీఎం జగన్ హయాంలో 2019 నుంచి ఇప్పటివరకు సుమారు 80 నుంచి 90 మంది సలహాదారులు, ఉప సలహాదారులను నియమించారు. వీరంతా ప్రభుత్వానికి ఏ విధంగా సలహాలు ఇస్తున్నారో అర్థం కావడం లేదు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ వీరికి అనవసరంగా నిధులు కేటాయిస్తున్నారని గతంలో హైకోర్టులో పిల్ వేశాం. దానిపై న్యాయస్థానం స్పందిస్తూ.. ఇంతమంది సలహాదారులను ఎందుకోసం నియమించారు? ఎలాంటి సలహాలు ఇస్తున్నారు? వాటిని ఎక్కడైనా అమలు చేస్తున్నారా? సలహాదారుల విధానం అనవసరం అని అభిప్రాయపడింది. సలహాదారుల నియామకానికి సంబంధించి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించిందని నాదెండ్ల చెప్పారు.

సలహాదారుల నియామకంలో నూతన విధానాన్ని తీసుకొస్తున్నట్లు గత ఏడాది మార్చిలో హైకోర్టుకు ప్రభుత్వం నివేదిక ఇచ్చింది. అర్హులనే నియమిస్తున్నట్లు పేర్కొంది. అయితే, సలహాదారులుగా నియమితులైనప్పటికీ సీఎంను కూడా కలవలేకపోతున్నామని కొందరు వాపోతున్నారు. ఈ సలహాదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు వెచ్చించింది

సుమారు రూ.680 కోట్లు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కోసమే రూ.140 కోట్లు ఖర్చు చేయడం గమనార్హమని నాదెండ్ల పేర్కొన్నారు.

అసలు వీరంతా ఎవరనేది ప్రజలకు తెలియాలి, ప్రభుత్వం వారి పేర్లను ప్రకటించాలి. ఎవరెవర్ని ఏ శాఖకు కేటాయించారనేది రాబోయే శాసనసభ సమావేశాల్లో సీఎం జగన్ చెప్పాలని, అలాగే ఆ సలహాదారులు పరిపాలనకు ఏ విధంగా ఉపయోగపడుతున్నారనేది కూడా చెప్పాలని డిమాండ్ చేశారు.

## 'భారతం' కూడా తెలియదా?

### జగన్‌పై వర్ల విసుర్లు

అమరావతి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మహా భారతంపై కూడా సరైన అవగాహన లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో ఒక పోస్ట్ పెట్టారు. ముఖ్యమంత్రి గారూ! మీకు "భారతం" కూడ ఆట్టే తెలిసినట్టు లేదు. బాలుడైన అభిమన్యుడిని కించపరిచే రీతిలో మాట్లాడుతున్నారు. వీరోచితంగా పోరాడి తన ప్రాణాలర్పించి పెద నాన్న, బాబాయిలను రక్షించిన ధీరోదాత్తుడు అభిమన్యుడు. మరి, ఈనాటి అర్జునులు తమ స్వంత బాబాయిలనే గొడ్డళ్లతో నరికేస్తున్నారు, కదూ.. అని వర్ల తన పోస్ట్‌లో వ్యాఖ్యానించారు.

## నిరుద్యోగులే నిన్ను దింపేస్తారు

### సీఎం జగన్‌రెడ్డికి ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరిక



చిలకలూరిపేట: డీఎస్సీకి మంత్రివర్గం ఆమోదం అంటూ మరోసారి నిరుద్యోగులకు తనదైన రీతిలో ద్రోహం చేసేందుకు సీఎం జగన్మోహన్‌రెడ్డి సిద్ధమయ్యారని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. జగన్ ప్రతిపక్షంలో ఉండగా హామీ ఇచ్చిన మెగా డీఎస్సీ మాట ఏమయ్యిందో ఇప్పుడైనా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు డీఎస్సీ అంటూ జగన్ సర్కారు నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రత్తిపాటి పుల్లారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు 2.3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ అన్నారు. మెగా డీఎస్సీ ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ మాటలు నమ్మి ఒక్క డీఎస్సీ కోసమే 7లక్షల మంది వరకు నిరుద్యోగులు నిద్రాహారాలు మాని, అప్పులు చేసి కోచింగ్‌లు తీసుకుంటూ అహోరాత్రులు కష్టపడుతున్నారని ప్రత్తిపాటి వెల్లడించారు. అయిదేళ్లుగా వారందరి జీవితాలతో చెలగాటమాడింది కాకుండా ఇప్పుడు 6వేల పోస్టులతో నోటిఫికేషన్ అనడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులోనూ రెండేళ్ల గౌరవ వేతనంతో అప్రెంటిస్‌షిప్ విధానం తిరిగి తీసుకురావడం మరింత దారుణమన్నారు. ఇది నయవంచనకు ప్రతిరూపం అని ధ్వజమెత్తారు ప్రత్తిపాటి. అదీగాక ప్రతిపక్షంలో ఉండగా జగన్ నోటితోనే అన్న 23 వేల ఉపాధ్యాయ పోస్టులు 6వేలకు ఎలా తగ్గాయో చెప్పాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు. ఉత్తుత్తి ఉద్యోగ నోటిఫికేషన్లతో వైకాపా ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోందని మండిపడ్డారు. సీఎం జగన్‌రెడ్డి కుర్చీ పీకడానికి నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారని ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు.

## సోరెన్‌కు ఈడీ కస్టడీపై తీర్పు రిజర్వ్

రాంచీ: నాటకీయ పరిణామాల మధ్య బుధవారం రాత్రి అరెస్టయిన ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌ను ఈడీ అధికారులు ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణ కోసం ఆయన్ను 10 రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోరారు. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు తీర్పును రేపటికి రిజర్వు చేసింది. శుక్రవారం వరకు హేమంత్ సోరెన్‌ను జ్యుడీషియల్ కస్టడీలో ఉంచాలని ఆదేశించింది. దీంతో సోరెన్‌ను ఈడీ అధికారులు జైలుకు తరలించారు. అంతకుముందు కోర్టుకు హాజరుపరిచేందుకు అధికారులు హేమంత్ సోరెన్‌ను తీసుకొచ్చిన సందర్భంలో వాహనంపై దిగుతుండగా నవ్వుతూ, అభివాదం చేస్తూ కనిపించారు. ఈడీ అధికారులు, భద్రతా సిబ్బంది మధ్య ఆయన కోర్టు హాలులోకి వెళ్లిన దృశ్యాలు రికార్డయ్యాయి. ఇదిలాఉండగా... తన అరెస్టును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తొలుత ఝార్ఖండ్ హైకోర్టులో పిటిషన్ వేసినప్పటికీ ఆ తర్వాత దాన్ని ఉపసంహరించుకున్నారు.

# గ్రానైట్ పరిశ్రమపై పగబట్టిన ప్రభుత్వం

- టీడీపీ సానుభూతిపరుల ఫ్యాక్టరీలపై దాడులు, అరెస్టులు వేధింపుల్లో భాగమే
- పారిశ్రామికవర్గాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం
- వైసీపీ రౌడీమూకలతో కలిసి అధికారుల తనిఖీలా?
- ఫిర్యాదు చేసిన వారిపైనే ఎదురుకేసులా?
- కుట్ర పూరితంగా పరిశ్రమల యజమానుల అరెస్ట్
- టీడీపీ నాయకుడు, ఎమ్మెల్యే ఏలూరి మండిపాటు

పర్చూరు: రాజకీయ కక్షసాధింపుల్లో భాగంగానే ప్రతిపక్ష పార్టీకి చెందిన పరిశ్రమలను దెబ్బతీస్తూ, వాటిల్లో పనిచేస్తున్న కార్మికులను రోడ్డున పడేశారని జగన్ ప్రభుత్వంపై టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ధ్వజమెత్తారు. బాపట్ల జిల్లా మార్టూరులోని గ్రానైట్ పరిశ్రమలపై మైనింగ్ అధికారులు వైసీపీ రౌడీలతో వచ్చి దాడులు నిర్వహించిన సంఘటనలో వారిని పోలీసులకు అప్పగించిన పరిశ్రమల యజమానులపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడాన్ని ఎమ్మెల్యే ఏలూరి తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు ఉద్దేశపూర్వకంగా తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుల ఫ్యాక్టరీలపై దాడులు నిర్వహించారని మండిపడ్డారు. మారణాయుధాలు, కారం పొట్లాలు, కర్రలతో వచ్చిన వారిని వదిలేసి, వారిపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన పరిశ్రమల యజమానులు, తెలుగుదేశం పార్టీ నాయకులపై కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. వేలాదిమంది స్థానిక కార్మికులతో పాటు ఇతర రాష్ట్రాల కార్మికులకు జీవనోపాధి కల్పిస్తున్న పరిశ్రమలపై ప్రభుత్వం కక్ష కట్టిందన్నారు. వేధింపులు, కక్ష సాధింపులతో గ్రానైట్ పరిశ్రమ మొత్తం మూతపడే దిశగా తీసుకెళ్లిన ఘనత ఈ ప్రభుత్వ పెద్దలకే దక్కుతుందన్నారు. తక్షణమే మైనింగ్ అధికారులు కక్ష సాధింపు దాడులను నిలిపివేసి పారిశ్రామిక రంగం ఉన్నతికి తోడ్పాటు అందించాలన్నారు. ప్రశాంతంగా ఉన్న పర్చూరు నియోజకవర్గంలో ఒక భయానక వాతావరణ సృష్టించి ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించి అలజడి రేపేందుకు కుట్ర జరుగుతోందని ఏలూరి ఆవేదన వ్యక్తం చేశారు.



### ఫిర్యాదు చేసిన వారిపై కేసులా...?

మార్టూరు గ్రానైట్ పరిశ్రమల్లో మైనింగ్ అధికారులతో వచ్చిన వైసీపీ రౌడీ మూకలపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన గ్రానైట్ యజమానులపైనే కేసులు నమోదు చేసిన పోలీసులు తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మారణాయుధాలతో వచ్చిన వారిని వదిలి గ్రానైట్ యజమానులను దొంగలుగా ముద్ర వేసి, వారి ఫిర్యాదులు సైతం తీసుకోకుండా వారిపైన కేసులు నమోదు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. అధికార పార్టీకి పోలీసులు దాసోహమై పనిచేస్తూ, ప్రతిపక్ష పార్టీ నాయకులపై కక్ష సాధింపులకు పాల్పడు తున్నారన్నారు. దీనికి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. అధికార పార్టీకి పోలీసులు తొత్తులుగా వ్యవహరించడం, వారు చెప్పిన విధంగా ప్రతిపక్ష పార్టీలను ఇబ్బందులు గురి చేయడం ప్రజా స్వామ్యానికే మాయనిమచ్చ అన్నారు.

### ఉద్దేశపూర్వకంగా అరెస్టులు.. కాలయాపన

రాజకీయ ఒత్తిడిలకు తలొగ్గి తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుల పరిశ్రమలపై దాడులు చేసి అరెస్టు చేశారని, కోర్టులో ప్రవేశపెట్టడంలోనూ జాప్యం చేశారని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు. ఈ నెల 30వ తేదీన సాయంత్రం ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన గ్రానైట్ పరిశ్రమ యజమానులు, పార్టీ నాయకులను బలవంతంగా ఈ రాత్రంతా స్టేషన్లో కూర్చోబెట్టారన్నారు. మరుసటి రోజు 31వ తేదీన ఉదయం 7 గంట లకు అద్దంకి కోర్టుకు తీసుకువెళ్లి మధ్యాహ్నం 2.30 గంటల వరకు రిమాండ్ నిమిత్తం హాజరు పరచకుండా పోలీసులు ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేశారన్నారు.దీని వెనుక కుట్రకోణం దాగి ఉందన్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు రాజకీయ పక్షపాతం లేకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడి, పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలని హితవు పలికారు.

# జగన్‌రెడ్డి వదిలింది దగా డీఎస్సీ

- 50,892 ఖాళీలుంటే, 6,100 పోస్టులతో నోటిఫికేషన్ నిరుద్యోగుల్ని వంచించడమే
- ఎన్నికల సమయంలో నిరుద్యోగుల్ని మరోసారి మోసగించే యత్నం
- ఏటా మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, 2.32 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ హామీలు ఏమయ్యాయి
- జగన్ నిర్వాకంతో నిరుద్యోగిత శాతంలో అగ్రస్థానంలో ఏపీ
- టీడీపీ అధికార ప్రతినిధి దాసరి శ్యామచంద్ర శేషు ధ్వజం

అమరావతి: జగన్‌రెడ్డి ప్రకటించింది మెగా డీఎస్సీ కాదని, దగా డీఎస్సీ అని టీడీపీ అధికార ప్రతినిధి దాసరి శ్యామచంద్ర శేషు విమర్శించారు. నిజం నిత్యం ప్రచారంలో ఉండాలి...లేకుంటే అబద్ధం నిజంగామారి ప్రపంచాన్నే నాశనంచేస్తుంది..అన్న బాబాసాహెబ్ అంబేద్కర్ మాటలు, బహుశా జగన్‌రెడ్డి లాంటి నాయకుల్ని ఉద్దేశించే చెప్పినట్లు అనిపిస్తోందని, అబద్ధాలే పరమావధిగా అబద్ధాలే నిత్యకృత్యంగా మోసపు పాలన సాగిస్తున్న వ్యక్తిగా జగన్‌రెడ్డి చరిత్రలో నిలిచి పోతాడని ధ్వజమెత్తారు. మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెగా డీఎస్సీ పేరిట రాష్ట్ర కేబినెట్ సమావేశంలో 6,100పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించారు.. ఉద్యోగాల భర్తీ అంశంలో అధికారంలోకి రాక ముందు జగన్‌రెడ్డి చెప్పిన మాటలకు, ఇప్పుడు చేస్తున్న దానికి ఎక్కడా పొంతనలేదన్నారు. తాను ముఖ్యమంత్రి అయితే ఏటా మెగా డీఎస్సీ నిర్వహిస్తానని, 2.32 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేస్తానని, ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని జగన్‌రెడ్డి నమ్మబలికాడు.ముఖ్యమంత్రి అయ్యాక జగన్‌రెడ్డి నాలుగు సంక్రాంతులు చేసుకున్నాడు.. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఒక్క సంక్రాంతి కూడా సంతోషంగా జరుపుకుంది లేదు. మాయమాటలతో నిరుద్యోగుల్ని, యువతను నట్టేట ముంచిన జగన్‌రెడ్డి, ఇప్పుడు మెగా డీఎస్సీ పేరుతో దగా డీఎస్సీ వదిలాడు. కేవలం ఎన్నికల నేపథ్యంలో 6,100పోస్టుల భర్తీకి సిద్ధమవ్వడం, రాష్ట్రంలోని దాదాపు 7లక్షల మంది నిరుద్యోగుల్ని నిలువునా మోసగించడమే. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి సంబంధించి జగన్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన నోటిఫికేషన్లో రోస్టర్ విధానం లేదు. రూల్ ఆఫ్‌లా నిబంధనలు పాటించలేదు. తనకు సంబంధించినవారు..తన సామాజికవర్గానికి సంబంధించి వారికి న్యాయం చేయడంకోసం నిజమైన మెరిట్ అభ్యర్థులకు అన్యాయం చేసేలా విశ్వవిద్యాలయాల్లో పోస్టుల భర్తీకి జగన్‌రెడ్డి సిద్ధమయ్యాడని శ్యామచంద్ర శేషు విమర్శించారు.

### 6100 ఖాళీలకే నోటిఫికేషన్ నయవంచన

2022, జూన్ 10న కేంద్ర విద్యాశాఖ పరిధిలో నిర్వహించిన సర్వశిక్షా అభియాన్ సమావేశంలో చెప్పిన వివరాలకు, తన 5ఏళ్ల పాలనలో జగన్‌రెడ్డి భర్తీ చేసిన ఉద్యోగాలకు ఎక్కడా పొంతనలేదు. సదరు సమావేశంలో ఏపీలో 50,892ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. 50,892 ఉపాధ్యాయ ఖాళీలుంటే, వాటిలో కేవలం 6100 ఖాళీలకు మాత్రమే జగన్‌రెడ్డి ఇప్పుడు నోటిఫికేషన్ ఇచ్చాడంటే నిరుద్యోగుల్ని ఎంత దుర్మార్గంగా వంచిస్తున్నాడో అర్థం చేసుకోవాలి.మొదటి రెండేళ్లపాటు పేస్కేల్ లేకుండా కేవలం టైమ్ స్కేల్ విధానంలో ఉద్యోగాల భర్తీ చేయడం ఎంత దారుణమో కూడా నిరుద్యోగ యువత గ్రహించాలి. దేశవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగితా శాతానికి సంబంధించి ఇటీవల కేంద్రం విడుదలచేసిన గణాంకాల్లో దేశంలోనే రాష్ట్రం అత్యధిక శాతంతో నిలిచింది. జాతీయ స్థాయిలో 11శాతం నిరుద్యోగిత ఉంటే, ఏపీలో అది 24 శాతంగా ఉండటం గమనార్హం. ఇచ్చిన హామీ నెరవేర్చని జగన్‌రెడ్డి నిర్వాకంతో నిరుద్యోగిత శాతంలో దేశంలోనే ఏపీ అగ్రస్థానంలో నిలిచింది. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆరా నివేదిక ప్రకారం ఏపీలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2వ తరగతి లెక్కలు కూడా చేయలేని స్థితిలో ఉన్నారని తేలింది. ఈ విధంగా ఉద్యోగాల భర్తీలో.. విద్యా ప్రమాణాల పెంపులో జగన్‌రెడ్డి ఘోరంగా విఫలమయ్యాడని శ్యామచంద్ర శేషు విమర్శించారు.

### నిరుద్యోగుల్ని వంచించడం కాదా?

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై జగన్ రెడ్డి..అతని మంత్రులు ఒక్కో సందర్భంలో ఒక్కో విధంగా లెక్కలు చెప్పారు.మంత్రి బొత్స సత్యనారాయణ 2023, మార్చి 21న రాష్ట్రంలో కేవలం 717 ఉపాధ్యాయపోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయన్నారు. అదే ఏడాది సెప్టెంబర్ 26న అసెంబ్లీలో ఆయనే ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ మొత్తం తమ ప్రభుత్వం 14,219 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసినట్టు అబద్ధాలు చెప్పాడు. 2019లో తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం క్వాలిఫై అయిన 7,254 అభ్యర్థుల్ని కూడా కలిపి చెప్పాడని శ్యామచంద్ర శేషు తప్పుబట్టారు.



### దేనికి సిద్ధం జగన్ రెడ్డి?

నిరుద్యోగుల్ని, యువతను దారుణంగా వంచించిన జగన్‌రెడ్డి ఇప్పుడు సిద్ధం అంటూ కొత్తప్రచారం మొద లెట్టాడు. ముఖ్యమంత్రి దేనికి సిద్ధమో ముందు నిరుద్యోగులకు సమాధానం చెప్పాలి. నిరుద్యోగుల్ని ఇంకా మోసగించడానికా, మహిళల్ని నాశనం చేయడానికా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను మరింత అణగదొక్కడానికా? జగన్‌రెడ్డిని శాశ్వతంగా జైలుకుపంపడానికి ప్రజలు సిద్ధమయ్యారని శ్యామచంద్ర శేషు స్పష్టం చేశారు.

### అనేక పరిశ్రమల్ని తరిమేశాడు

అమ్మఒడి పేరుతో పిల్లల్ని చదివించడానికి డబ్బులు ఇస్తున్నానంటూ, చాలీచాలకుండా ఇంటికి ఒక్కరికే ఆర్థికసాయం చేస్తూ తల్లిదండ్రుల్ని ముష్టి ఎత్తుకునే స్థితికి తీసుకొచ్చాడు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల పిల్లలు చదువుకొని ఉన్నత స్థానాలకు రావడం ఇష్టం లేకనే జగన్‌రెడ్డి.. ఆయా వర్గాల పిల్లలకు అమ్మఒడి సాయం అరకొరగా అందిస్తున్నాడు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య చదువుకోవడానికి చంద్రబాబు తీసుకొచ్చిన విదేశీ విద్య పథకాన్ని రద్దు చేశాడు.చంద్రబాబు తీసుకొచ్చిన గోపాలమిత్ర, కల్యాణమిత్ర, ఆరోగ్య మిత్ర వంటి విభాగాలను తొలగించాడు. చంద్రబాబు ఏపీకి తీసుకొచ్చిన హెచ్.సీ.ఎల్, లులూ గ్రూప్, రిలయన్స్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ వంటి ప్రముఖ సంస్థల్ని రాష్ట్రం నుంచి తరిమేశాడు. దశాబ్దాలుగా రాష్ట్రంలో ఉన్న అమర్ రాజా కంపెనీని తరిమేశాడు. 5 ఏళ్లలో జగన్‌రెడ్డి యువతకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకపోవడంతో నిరుద్యోగులు పొరుగు రాష్ట్రాలకు వలసవెళ్లాల్సిన దుస్థితి వచ్చింది. పోతే పొట్టకూటి కోసం పొరుగు రాష్ట్రాలకు పోవడం.. ఉంటే జగన్ రెడ్డి అమ్ముతున్న కల్తీమద్యం, గంజాయి తాగుతూ సైకోల్లా ప్రవర్తించడం. యువగళం పాదయాత్రలో నారాలోకేశ్ చెప్పినట్టు తెలుగుదేశం-జనసేన ప్రభుత్వం వచ్చిన తరువాత ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 20లక్షల మంది యువతకు ఉద్యోగాలు లభిస్తాయి. జగన్‌రెడ్డి నయవంచనకు గురైన యువత 'రా.. కదలిరా' సభల్లో చంద్రబాబుకు నీరాజనం పడుతున్నారు. జగన్‌రెడ్డికి ఆయన చెల్లి షర్మిలతో పాటు, సొంత ఎంపీలు.. ఎమ్మెల్యేలు కూడా బైబై చెబుతున్నారు. నిరుద్యోగాంధ్రప్రదేశ్ మరలా ఉద్యోగాంధ్రప్రదేశ్ కావాలంటే అది టీడీపీ-జనసేన ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని శ్యామచంద్ర శేషు తేల్చిచెప్పారు.

### గంజాయి, డ్రగ్స్‌కు కేంద్రంగా మార్చాడు

ఉద్యోగాలు ఇవ్వని తన చేతగానితనాన్ని, అసమర్థతను నిరుద్యోగులు, యువత ఎక్కడ ప్రశ్నిస్తారోనన్న భయంతో జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని మాదక ద్రవ్యాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చాడు. కల్తీ మద్యంతో పాటు, గంజాయి, ఇతర డ్రగ్స్‌ను రాష్ట్రంలో విచ్చలవిడిగా అందుబాటులోకి తీసుకురావడంతో గంజాయాంధ్రప్రదేశ్, డ్రగ్సాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం మారింది. మత్తు పదార్థాలకు బానిసలై, ఉపాధిలేక చివరకు 1745యువత బలవన్మరణాలకు పాల్పడ్డారు. అధికారికంగానే ఇంత మంది మరణిస్తే, అనధికారికంగా ఆసంఖ్య ఇంకా రెండింతలు ఉండే అవకాశం ఉందని శ్యామచంద్ర శేషు అన్నారు.

# గిరిజనులకు జగన్‌రెడ్డి తీరని ద్రోహం

- జీవో-3ని సుప్రీంకోర్టు కొట్టేస్తే జగన్‌రెడ్డి ప్రభుత్వం అప్పీల్ కు కూడా వెళ్లలేదు
- జగన్ అవినీతి కేసులు, ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసుల్లో మాత్రం ప్రజలసొమ్ము చెల్లించి మరీ పెద్ద లాయర్లు
- గంజాయి సాగుతో బతుకుతారనే అహంకార ధోరణితో జగన్
- వచ్చే ఎన్నికల్లో గుణపాఠం ఖాయం
- టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారు నాయక్ మండిపాటు

అమరావతి: గిరిజనులకు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చేసిన ద్రోహం మాటల్లో చెప్పలేనిదని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారునాయక్ మండిపడ్డారు. అధికారంలోకి రాకముందు నా ఎస్సీలు,నా ఎస్టీలు,నా బీసీలు, నా మైనారిటీలు అన్న జగన్‌రెడ్డి, ముఖ్యమంత్రి అయ్యాక ఆ వర్గాలను దారుణంగా అణచివేశాడన్నారు. గిరిజనజాతి ఏకతాటిపై నిలిచి జగన్‌కు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉందన్నారు. మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాటాడుతూ

గిరిజన ప్రాంతాల్లో ఉపాధ్యాయ పోస్టులను గిరిజనులతోనే భర్తీ చేయాలనే జీవో ఎం.ఎస్.-3ని జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత సుప్రీంకోర్టు కొట్టేస్తే, దానిపై వైసీపీ ప్రభుత్వం ఎలాంటి అప్పీళ్లకు పోలేదని తప్పుబట్టారు. దేశంలోని అనేక రాష్ట్రాలు సుప్రీంతీర్పుపై గిరిజనులకు అన్యాయం జరుగుతుంది అంటూ అప్పీల్ చేస్తే, ఏపీ ప్రభుత్వం మాత్రం ఆ దిశగా ఎలాంటి అడుగు వేయలేదు. గిరిజనులకు మేలు కలిగే కేసుపై వాదించడానికి లాయర్లు లేరు.. డబ్బులు లేవని జగన్ రెడ్డి సర్కార్ చెప్పడం దుర్మార్గం. తనపై ఉన్న అవినీతికేసులు, ప్రతిపక్ష నేతలపై పెట్టిన తప్పుడు కేసులు వాదించడానికి పెద్దపెద్ద లాయర్లను నియమించిన జగన్‌రెడ్డి,వందలకోట్ల ప్రజలసొమ్మును దుర్వినియోగం చేశాడు గానీ.. గిరిజనుల కోసం మాత్రం న్యాయవాదుల్ని నియమించలేదని ధారునాయక్ తప్పుబట్టారు.

### గిరిజనుల్ని గాలికి వదిలేశారు

ఉపముఖ్యమంత్రి రాజన్న దొర తన నియోజకవర్గానికే పరిమితమై, గిరిజన సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాడు. ఐటీడీఏల్లో జరిగే అవినీతిని కట్టడి చేయకుండా రాజన్నదొర తనకేమీ సంబంధం లేదన్నట్టు వ్యవహరిస్తుండటంతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. వైసీపీలోని గిరిజన ఎమ్మెల్యేలు.. గిరిజన క్షేమాన్ని పూర్తిగా విస్మరించి, జగన్‌రెడ్డి భజనపరులుగా మారారు. ఆఖరికి తిరుపతి వెళ్లడానికి ఇచ్చే సిఫార్సు లేఖలకు కూడా డబ్బులు అడిగే దుస్థితికి దిగజారారు. అధికారపార్టీలోని గిరిజన ఎమ్మెల్యేలకు జగన్‌రెడ్డి భజన తప్ప, సాటి సోదరుల సమస్యలు పట్టడం లేదు. గిరిజనులకు టీడీపీ ప్రభుత్వం అమలుచేసిన అనేక సంక్షేమ పథకాల్ని జగన్‌రెడ్డి రద్దుచేశాడని ధారు నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



### స్వయం ఉపాధి రుణాలు మాయం

తన 5ఏళ్ల పాలనలో జగన్‌రెడ్డి గిరిజన యువతలో ఒక్కరికి కూడా ఒక్క రూపాయి స్వయం ఉపాధి రుణం ఇవ్వలేదు. కేంద్రప్రభుత్వం గిరిజన యువతకు ఇచ్చే ఎన్.ఎస్.టీ.సీ రుణాలు కూడా అందకుండా చేశాడు. రాష్ట్రప్రభుత్వ గ్రాంట్‌గా ఇవ్వాల్సిన నిధులు జగన్‌రెడ్డి ఇవ్వకపోవడంతో కేంద్రనిధులు మురిగిపోయాయి. రాష్ట్రంలో గిరిజనులపై జరుగుతున్న దాడులు దేశంలో మరెక్కడా జరగడం లేదు. పల్నాడు జిల్లా నకరికల్లులో శ్రీనివాసరెడ్డి అనే వైసీపీ నాయకుడు మంత్రూ బాయ్ అనే గిరిజన మహిళను ట్రాక్టర్‌తో తొక్కించి చంపినా ఎలాంటి చర్యలులేవు. ఒంగోలులో గిరిజన యువకుడు నవీన్‌పై మూత్రం పోసిన ఘటనలో నిందితులపై ఎలాంటి చర్యలులేవు. కృష్ణాజిల్లా మోపిదేవి మండలం, కే కొత్తపాడులో ముగ్గురు గిరిజన మహిళల్ని వైసీపీ నేతలు చావగొట్టినా నిందితులపై కేసు నమోదు కాలేదు. వైసీపీ ప్రభుత్వం ఒకఅజెండా ప్రకారమే గిరిజనాభివృద్ధిని విస్మరించి, గిరిజనులపై దాడులకు పాల్పడుతోంది. గిరిజనులకు సక్రమంగా రేషన్ బియ్యం కూడా అందించలేని ఈ అసమర్థ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో గిరిజనులు గట్టిగా బుద్ధిచెబుతారు. జగన్‌రెడ్డి గతంలో... చంద్రబాబు గిరిజనులకు ఏమీచేయలేదు.. తాను అధికారంలోకి వస్తే అనేక పదవులు ఇస్తానని నమ్మబలికాడు. తీరా ముఖ్యమంత్రి అయ్యాక గిరిజనులకు ఎలాంటి నామినేటెడ్ పదవులు ఇవ్వలేదు. అదే జగన్‌రెడ్డి తన సామాజిక వర్గానికి మాత్రం 900 నామినేటెడ్ పోస్టులు ఇచ్చుకున్నాడని ధారునాయక్ విమర్శించారు.

### గిరిజనులకు చేసిందేమీ లేదు

మంత్రిగా పనిచేసిన పుష్పశ్రీవాణి విధులు, నిధులు లేనిశాఖ వెలగబెట్టి, చివరకు టిక్ టాక్ మంత్రిగా పేరు పొందింది. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రిగా ఉన్న రాజన్న దొర ఇంటి నుంచే బయటకు రాడు. వారిద్దరూ గిరిజనుల సంక్షేమానికి చేసింది శూన్యం.జగన్‌రెడ్డి అవినీతి, దుర్మార్గపు పాలనకు ముగింపు పలకడానికి గిరిజనులు సిద్ధమయ్యారు.మరలా జగన్ ముఖ్యమంత్రి అయితే గిరిజనుల బతుకులు అంధకారం కావడం ఖాయం. ఎన్నికలు వస్తున్నాయనే గిరిజన గురుకులాల పర్యవేక్షణకు ప్రభుత్వం ఇప్పుడు అధికారుల్ని నియమిం చింది. చెత్త ముఖ్యమంత్రి చెత్తపాలనకు, దుర్మార్గపు పాలనకు స్వస్తి చెప్పి, వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేస్తేనే తమకు మంచి భవిష్యత్ అనే నిర్ణయానికి గిరిజనులు వచ్చారని ధారునాయక్ స్పష్టం చేశారు.

### 17వేల మంది చదువుకు దూరమయ్యారు

గిరిజనులకు గత ప్రభుత్వాలు ప్రత్యేక డీఎస్సీ నిర్వహిస్తే, జగన్‌రెడ్డి వచ్చాక ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేదు. టీడీపీ ప్రభుత్వం గిరిజన విద్యార్థుల కోసం తీసుకొచ్చిన బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల విధానాన్ని జగన్ రెడ్డి రద్దు చేయడంతో దాదాపు 17వేల మంది గిరిజన విద్యార్థులు చదువుకు దూరమయ్యారు. ఇంగ్లీష్ మీడియం తీసుకొచ్చానని, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్టు చెబుతున్న జగన్‌రెడ్డి మాటలన్నీ పచ్చిఅబద్ధాలు.టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విదేశీ విద్య, భూమి కొనుగోలు పథకం, గిరిపుత్రిక వంటి పథకాల్ని జగన్ రద్దు చేశాడు. చంద్రబాబునాయుడు 500లకు పైబడి జనాభా ఉన్న తండాల్ని పంచాయతీలుగా మార్చి వాటి అభివృద్ధికి నిధులు కేటాయిస్తే, జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తండాల్లో కనీస వసతులు కూడా లేకుండా పోయాయి. గిరిజనులకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తానని చెప్పిన జగన్‌రెడ్డి, ఇప్పుడు గిరిజనులు విద్యుత్ బిల్లులు కట్టక పోతే కరెంట్ సరఫరా నిలిపివేస్తామని బెదిరిస్తున్నాడు. ఇన్నేళ్లు అధికారంలో ఉన్న జగన్‌రెడ్డి, బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయకుండా గిరిజన యువతను గంజాయి సాగు చేసుకొని బతకండి అంటూ హేళన చేస్తున్నాడు. గిరిజనులు సాగుచేసుకుంటున్న భూముల్ని వారికి ఇవ్వకుండా వాటిపై హక్కులు లేవని వారిని తరిమేస్తున్నారు. టీటీడీ పరిధిలోని హథీరాంజీ ట్రస్ట్ భూముల్ని కూడా వైసీపీ నేతలు కబ్జా చేశారు. అలాంటి వారిపై జగన్‌రెడ్డి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ధారు నాయక్ విమర్శించారు.

## నేటి నుండి ధవళేశ్వరం బ్యారేజీ మూసివేత

### వాహనాల రాకపోకలు నిలిపివేత

రాజమహేంద్రవరం: ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్‌ను శుక్రవారం నుంచి మూసివేయనున్నారు. బ్యారేజ్‌పై రోడ్డు మరమ్మత్తుల నిమిత్తం 10 రోజులు పాటు వాహనాల రాకపోకలు నిలిపివేసి మూసివేస్తారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ రోడ్డు బాగా దెబ్బతినడంతో 2 కోట్ల రూపాయలు ప్రతిపాదనలతో మరమ్మత్తు పనులు చేపడుతున్నారు. మరమ్మత్తు పనులు నిమిత్తం ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ రహదారి మూసివేస్తున్నట్టు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కే.మాధవీలత ఆదేశాలు జారీచేశారు. బ్యారేజ్‌పై నుంచి ప్రయాణించే ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సుల యాజ మాన్యాలు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని సూచించారు.



ఈనెల 10వ తేదీ వరకు మరమ్మత్తులు కొనసాగనుండగా..అనంతరం యథావిధిగా రాకపోకలకు అనుమతి ఇవ్వనున్నారు. మరోవైపు..ఈపనులు నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేసేలా ఇరిగేషన్ అధి కారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మొత్తంగా రాజమండ్రి రూరల్ మండలంలోని ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ మరమ్మత్తు పనుల నిమిత్తం మూతపడనుండగా.. ఇరిగేషన్ అధికారుల కోరిక మేరకు పోలీస్ అధికారుల ట్రాఫిక్ మళ్లింపుపై చర్యలు చేపట్టారు.. కాటన్ బ్యారేజ్ మీదుగా ప్రయాణాలు సాగించే వారు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

## దళిత యువకుడి శిరోముండనం కేసులో

# నిందితుల క్వాష్ పిటిషన్ కొట్టివేత

### - విచారణ కొనసాగించాలన్న హైకోర్టు

అమరావతి: దళిత యువకుడు వరప్రసాద్ శిరోముండనం కేసులో నిందితులు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. గురువారం ఈ కేసుకు సంబంధించి హైకోర్టులో విచారణ జరిగింది. వరప్రసాద్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నారనే కోపంతో వరప్రసాద్‌ను కులం పేరుతో దూషించి, రాజకీయ నాయకుల అండదండలతో పోలీస్ స్టేషన్‌లోనే శిరోముండనం చేయించారని చెప్పారు. నిందితులకు చట్టం ప్రకారం శిక్ష విధించాలని కోర్టును కోరారు. విచారణ పూర్తి కాకుండా నిందితులు వేసిన క్వాష్ పిటిషన్‌పై న్యాయస్థానాలు తీర్పులు ఇవ్వలేవని సుప్రీంకోర్టు మార్గ నిర్దేశాలను అనుసరించి క్వాష్ పిటిషన్ డిస్మిస్ చేయాలని కోరారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్ట్.. నిందితుల క్వాష్ పిటిషన్ కొట్టి వేస్తూ తీర్పు వెల్లడించింది. విచారణ కొనసాగించ వలసిందిగా పోలీసులకు రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

### సుదీర్ఘ విచారణ తర్వాత...

కాగా.. తూర్పు గోదావరి జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నాడనే కక్షతో అధికార వైఎస్ఆర్సీపీ నాయకులు పోలీస్ స్టేషన్‌లోనే దళిత యువకుడు వరప్రసాద్‌కు శిరోముండనం చేయడం అప్పట్లో సంచలనంగా మారింది. తనకు న్యాయం జరగకపోవడంతో నక్సలైట్‌లో కలిసి పోయేందుకు అనుమతి ఇవ్వాలంటూ వరప్రసాద్ ఏకంగా రాష్ట్రపతికే లేఖ రాశాడు. ఈ విషయంలో తగుచర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి ఆదేశాలు ఇచ్చినా వరప్రసాద్‌కు న్యాయం జరగలేదని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. నిందితులపై పెట్టిన కేసులో తదుపరి విచారణ జరపకుండా 2020లో రాష్ట్ర హైకోర్టుస్టే ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం కారణంగా నాలుగు సంవత్సరాల క్రితం విచారణపై స్టే విధించింది అనే ఆరోపణలు వచ్చాయి. సుదీర్ఘ విచారణ అనంతరం నిందితులు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టి వేస్తూ హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. విచారణ కొనసాగించాలని పోలీసులను ఆదేశించింది.




### ఈఎస్ఐ కేసులో అచ్చెన్నాయడిపై చార్జిషీటును

## పరిగణలోకి తీసుకునేందుకు కోర్టు నిరాకరణ

అమరావతి: ఈఎస్ఐ కేసులో ఏపీ తెలుగుదేశం అధ్యక్షుడు, కింజరాపు అచ్చెన్నాయుడుపై చార్జిషీటును పరిగణలోకి తీసుకునేందుకు ఏసీబీ న్యాయస్థానం నిరాకరించింది. గురువారం విజయవాడ ఏసీబీ కోర్టులో చార్జిషీట్ వేసేందుకు ఏసీబీ అధికారులు వచ్చారు. అయితే అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం చార్జిషీట్ వేసేందుకు గవర్నర్ అనుమతి తప్పనిసరి అని, గవర్నర్ అనుమతి లేకుండా చార్జిషీట్ పరిగణలోకి తీసుకోలేమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. కాగా చార్జిషీటును పరిగణలోకి తీసుకోవచ్చని ఏసీబీ తరపు న్యాయవాదులు చెప్పారు.

అనుమతి లేకుండా చార్జిషీట్‌ను పరిగణలోకి తీసు కోవచ్చని ఏమైనా తీర్పులుఉన్నాయా.. అని న్యాయస్థానం ప్రశ్నించింది. ఉన్నత న్యాయ స్థానాలు ఇచ్చిన అటువంటి తీర్పులు ఏమై నా ఉంటే ఇవ్వాలని న్యాయమూర్తి కోరా రు. అటువంటి తీర్పులులేకుండా చార్జిషీట్ ను పరిగణలోకి తీసుకునేది లేదని మరో సారి న్యాయమూర్తి చెబుతూ తదుపరి విచా రణ ఫిబ్రవరి 6వ తేదీకి వాయిదా వేశారు.

## నిరుద్యోగులకు జగన్ దగా: చిరంజీవి రావు

విశాఖ: మెగా డీఎస్సీ ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆ హామీ విస్మరించి, నిరుద్యోగులను దగా చేశారని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు విమర్శించారు.

ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్నందున డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ మళ్లీ నిరుద్యోగులను మోసం చేస్తున్నారన్నారు. గురువారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...

2019 సాధారణ ఎన్నికలకు వెళ్లే ముందు రాష్ట్రంలో 2 లక్షల 30 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, టీచర్ పోస్టులు అయితే 23 వేలకుపైగా ఖాళీగా ఉన్నాయని, అధికారంలోకి రాగానే వాటన్నింటినీ భర్తీ చేస్తామని అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి ఎన్నో హామీలు ఇచ్చారన్నారు.

అధికారవలోకి వచ్చిన తరువాత వాటిని విస్మరించి, పాలనా కాలం ముగింపునకు వచ్చిన దశలో కేవలం 6,100 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం ఎవరిని మోసగిచ్చేందుకని ప్రశ్నించారు. ఉపాధ్యాయ ఉద్యోగాల్లో అప్రంటీస్ షిప్ తీసుకురావాలని చూస్తున్నారని చిరంజీవిరావు తప్పుబట్టారు.

# మొండితోక..
# నిలువెల్లా అవినీతే!!

- డాక్టర్ ఎమ్మెల్యే దోపిడీ 1200 కోట్లు
- ఎమ్మెల్సీ తమ్ముడే అతని సైన్యం..
- కొండలు పిండేశారు.. చెరువులు పీల్చేశారు
- ప్రతి పనికీ రేటు.. కాదంటే కాటు
- చీకటి పనులకు అనధికార కేబినెట్
- శ్రీవారి సిఫార్స్ టికెట్లకూ శఠగోపం
- ఇదీ మొండితోక బ్రదర్స్ అంతులేని దందా



## ఇళ్ల పట్టాల పేరుతో దోపిడీ

నందిగామ నియోజకవర్గంలో ఇళ్ల పట్టాలకు లబ్ధిదారులుగా 15,388మందిని గుర్తించారు. వీరికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు 342 ఎకరాలు అవసరమని అంచనా వేసి 52 ఎకరాల ప్రభుత్వ భూమి పోగా 290 ఎకరాల భూమిని సేకరించారు. ఇందులో మొండితోక బ్రదర్స్ రూ.80 కోట్ల మేర వెనకేసుకున్నారు. రైతుల నుంచి ఎకరా రూ.19 లక్షలకు కొనుగోలు చేసి ఆ భూమిని తిరిగి ప్రభుత్వానికి రూ.30 నుంచి రూ.40 లక్షలకు అమ్మారు. వేళ్లపాడు మండలం జుజ్జూరు గ్రామంలో, నందిగామ మండలం అనాసాగరంలో సేకరించిన భూమి నివాసయోగ్యానికి కూడా పనికిరా కుండా ఉంది. శనగపాడు రోడ్డు వెంట కొనుగోలు చేసిన భూమి శ్మశానం పక్కనే ఉంటుంది. ఇలా నియోజకవర్గంలో నివాసయోగ్యంకాని భూమిని కొనుగోలు చేసి ప్రజలకు కట్టబెట్టారు.

*చదివింది డాక్టరు*
*జనం ముందు యాక్టరు.*
*చేసేది ప్రజా -సేవ*
*కోట్లు మింగేయాలన్న - యావ.*

ఉన్నత చదువులు చదివిన బుద్ధి -వక్రమార్గం పట్టింది.మొండితోక బుర్రలో-కుట్ర రూపుదిద్దు కుంది. కోట్లు కొల్లగొట్టాలంటే వైసీపీ తానులో దారంపోగైనా చాలనుకున్నాడు. అలా.. మొండితోక జగన్మోహన్‌రావు అను అతను ఫ్యానుగాలికి ఎగిరొచ్చి నందిగామ ఎమ్మెల్యే అయ్యాడు. అంతే.. ప్రాణాలు పోయాల్సిన వైద్యవృత్తి మాయమై.. ప్రాణాలు తోడేసే నీచ రాజకీయ ప్రవృత్తి బలపడింది అతని బుర్రలో.

### అధికారంలోకి రాగానే..

ఆవు చేలోమేస్తే దూడగట్టున మేయాలా? అని ప్రశ్నించుకున్నాడు. వైసీపీ చీఫ్ జగన్మోహన్‌రెడ్డి మాదిరే తానూ చేలోకే దిగాడు. కాకపోతే..తొండి జగన్ రాష్ట్రం మీద పడితే.. మొండితోక నందిగామ మీదకు ఎగ బడింది. కట్‌చేస్తే -ఐదేళ్లలో అతని ఆస్తి రూ.1200 కోట్లయ్యింది. అధికార పరిధి, ప్రాంత పరిధిలాంటి లెక్కల్లో నిష్పత్తులు లెక్కగడితే-జగన్‌ను మించి ఆస్తుల ను మొండితోక కూడబెట్టారన్నది.. నియోజకవర్గం మొత్తం నిలువుకాళ్లపై నిలబడి చెప్పే పచ్చి నిజం.

ఆవు చేలోపడితే.. పంట నాశమనమవుద్ది. మొండితోక నియోజకవర్గంపై ఎగబడితే.. నందిగామ సర్వనాశనమైంది. సహజసిద్ధమైన కొండలు, పచ్చటి పొలాలు, చారిత్రక దేవాలయాలతో రమణీయమైన నందిగామ నేడు నిస్సారమైంది. సహజ వనరుల దోపిడీకి గురైంది. భూకబ్జాలకు అడ్డాగా మారింది. ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ -మళ్లీ అధికారం చేపట్టడం కష్టమని మొండితోక ముందే ఊహించాడు. తమ్ముడు మొండితోక అరుణ్‌కుమార్‌ని తోడేసుకుని.. నందిగామను చెరబట్టిన నయీం సోదరుల్లా మారారు. ప్రజలను పీల్చిపిప్పి చేశారు.

ఈ భూబకాసురుల దెబ్బకు నియోజకవర్గంలో ప్రభుత్వ ఆస్తులు మాయమయ్యాయి. ప్రైవేటు ఆస్తులకు రక్షణ కరవైంది. కొండలను, గుట్టలను తవ్వేస్తూ.. మహావృక్షాలను కూకటి వేళ్లకు నరికేస్తూ నందిగామకే నిలువ నీడలేకుండా చేశారు. ఖాళీ భూములు కబ్జా చేశారు. శ్మశానాలు, చెరువులు, దళితుల భూములే కాదు.. కొండల్ని సైతం మింగేసి నందిగామ అనకొండలనిపించుకున్నాయి ఈ మొండితోకలు. ఏతావాతా ఐదేళ్లలో ప్రజలిచ్చిన అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.1200 కోట్ల ఆస్తులు కూడబెట్టారని నందిగామ కోడై కూస్తోంది. మొండితోక బ్రదర్స్ అవినీతికి అంతులేదు. టీటీడీ దర్శనాలకు ఇచ్చే సిఫార్స్ లెటర్లూ బహిరంగంగా అమ్మకానికి పెట్టడం నుంచి.. కొండల్ని కూల్చేసి పిండిగా అమ్మేయడం వరకూ వీళ్ల దందా సాగిపోతోందంటే.. అవినీతి పరాకాష్టను అంచనా వేసుకోవచ్చు.

### చేతికి మట్టంటకుండా...

మొండితోక జగన్మోహన్‌రావు డాక్టరే కాదు.. యాక్టర్ కూడా. సెగ్మెంట్‌లో అరాచకాలకు, అవినీతి కార్యకలాపాలకు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం ఈ ఎమ్మెల్యే వైద్యుడే. మొత్తం దందాను ముందుండి నడిపించేది మాత్రం తమ్ముడు అరుణ్‌కుమార్. వైద్యవృత్తితో యువతకు ఆదర్శంగా నిలవాల్సిన మొండితోక జగన్మో హన్‌రావు-420లు, మాఫియాలకు కింగ్‌పిన్‌గా మారా డు. చేతికి మట్టంటకుండా దందాలు సాగించ టంలో దిట్ట. భూకబ్జాలు, ఇసుక మాఫియా, జె-ట్యాక్స్ వసూ లుకు సంబంధించిన ప్రణాళికలను మొండితోక జగ న్మోహన్‌రావు రూపొందించి.. తమ్ముడైన ఎమ్మెల్సీ అరు ణ్‌కుమార్‌తో వ్యవహారాన్ని నడిపిస్తుంటాడు. కాంట్రా క్టర్ల నుంచి డబ్బులు వసూలు చేయడం, పోస్టింగులకు రేటు నిర్ణయించడం, అడ్డగోలు అక్రమాల ద్వారా సం పాదించిన మొత్తాన్ని ఇతర రాష్ట్రాల్లో పెట్టుబడి పెట్టడం వంటి చర్యలన్నీ అరుణ్‌కుమార్.. అన్న పట్ల అచెంచల భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుంటాడు.

### ప్రతి పనికీ పైసా వసూల్

ఎమ్మెల్యే సిఫారసు కావాలన్నా, ఫోన్ సాయం చేయాలన్నా, సంతకం పెట్టాలన్నా -పైసా ఇవ్వనిదే ఫైలు ముందుకెళ్లదు. నందిగామ ప్రజల రక్తం పిండటంలో వీళ్లు సిద్ధహస్తులు.

1. ట్రక్కు మట్టికి రైతు కట్టాల్సిన కప్పం రూ. 3000.
2. నాలుగు మండలాల్లో.. ఒక్కో పోలీస్ స్టేషన్ నుండి నెలవారీ దందా రూ.2 5 లక్షలు.
3. నియోజకవర్గ పరిధిలో ఒక్కో బార్ లైసెన్స్‌కి ముడుపులు రూ.25లక్షలు.
4. ప్రతి అపార్ట్‌మెంట్ నుండి రూ.5 లక్షల మేర వసూలు... లేకుంటే మున్సిపల్ దాడులు.
5. కేబుల్ యాజమాన్యం నుండి ఏడాదికి దందా గిఫ్ట్ రూ.5 లక్షలు.
6. దీపావళి టపాసుల లైసెన్స్ షాప్‌ల మీదా వసూళ్లే.
7. వ్యాపారులు దగ్గర బెదిరించి వసూళ్లు.
8. అమ్మకానికి టీటీడీ దర్శనం లెటర్ రూ.10 వేలు.
9. టీచర్ల బదిలీకి రూ.లక్ష.
10. పోలీస్ పోస్టింగ్‌కు రూ.5 నుంచి రూ.20 లక్షలు.
11. రెవెన్యూలో పోస్టింగ్‌కు రూ.10 లక్షలు. ఇప్పుడు చెప్పుకున్నవన్నీ మచ్చుకే..

### ప్రభుత్వ స్థలాల్లో వెంచర్లు

వైసీపీ అవినీతి అనకొండలు ప్రభుత్వ స్థలాల్లో వెంచర్లు వేసి ప్రజలకు అమ్మడం సర్వసాధారణం. కానీ ఇక్కడ పంట పొలాలకు నీళ్లిచ్చే చెరువులు, కాల్వలను కబ్జా చేసి.. వెంచర్లు వేసి.. ప్రజలకు అమ్మిన చరిత్ర మొండితోక సోదరులది. నందిగామ పట్టణానికి దగ్గరలోని పీడబ్ల్యుడి, ఎస్ఎస్‌డబ్ల్యు కాల్వలు పూడ్చేసి రియల్ ఎస్టేట్ వెంచర్ వేశారు. జాతీయ రహదారికి అత్యంత సమీపంలో ఉండడంతో సెంటు రూ.3 లక్షలు చొప్పున విక్రయించి కోట్లు సొమ్ము చేసుకున్నారు. విషయం బట్టబయలైతే ఇబ్బందులు తలెత్తుతాయని ముందేగ్రహించి ఇందులో కొంత భాగాన్ని పేదలకు ఇళ్ల పట్టాల పేరిట మరో నాటకానికి తెరలేపారు. ఇక్కడ పేదలంటే మొండితోక బ్రదర్స్ అనుచరులు మాత్రమే. వారి పేరుతో 3 ఎకరాలు ఇళ్ల స్థలాలిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా సెంటు పట్టా భూములు పంపిణీ చేస్తే, నందిగామలో మాత్రం 2 సెంట్లు, 3 సెంట్లు పంపిణీ చేశారు. ఎందుకంటే, లబ్ధిదారులు ప్రజలు కాదు, మొండితోక బినామీలు. విచిత్రమేంటంటే ఇళ్ల స్థలాలు ఇచ్చింది ప్రభుత్వ అధికారులు కాదు, మొండితొక బ్రదర్సే. దగ్గరుండి తతంగం పూర్తి చేయించడం గమనార్హం.

### మాయమైన కొండలు

రాఘవాపురం, పెద్దవరం, నందిగామ రూరల్ మండలంలోని పల్లగిరి కొండ, మొగలూరులోని కీసర కొండ కొండలను తవ్వేసి ఆనవాళ్లు కూడా లేకుండా చేసేశారు మొండితోక బ్రదర్స్. రోజుకు 100 లారీలు తగ్గకుండా గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఒక్కో లారీ గ్రావెల్‌ను రూ.25 వేలకు అమ్ముతున్నారు. అంటే రోజుకి ఈ అక్రమార్కుల ఆదాయం రూ.20 లక్షలు పైనే. కొండలు, గుట్టలు చూస్తుండగానే లోయలయ్యాయి. కొండలను పిండి చేసేందుకు ప్రత్యేకంగా చెన్నై నుండి భారీ క్రేన్లు తీసుకొచ్చి మరీ దందా నడిపిస్తున్నా అడిగే నాధుడే లేడు. పేదలకు ఇస్తున్న ఇళ్ళ స్థలాల మెరక కోసమని గోరంత మొత్తానికి అనుమతి తెచ్చుకుని కొండ మొత్తాన్ని తవ్వేస్తున్నారు. నందిగామ- కంచికచర్ల బైపాస్ రహదారి విస్తరణకు గ్రావెల్ అవసరమని అనుమతి పొందిన కాంట్రాక్టర్ వద్ద రూ.3 కోట్లు డబ్బులు వసూలు చేసి అనుమతి ఇచ్చినచోట కాకుండా మరోచోట మైనింగ్‌కు ఎమ్మెల్యే అనుమతి ఇచ్చాడు. కొండలను తవ్వడాన్ని ప్రశ్నించిన ప్రజా సంఘాలపై దాడులకూ పాల్పడ్డారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేని దుస్థితి.

### మున్సిపాలిటీల్లో అవినీతి

నందిగామ మున్సిపాలిటీలో ఏ ఫైలు క్లియరవ్వా లన్నా మొండితోక సోదరుల అనుమతి కావాల్సిందే. నిర్మాణాలు, లేఅవుట్లకు, షాపుల లైసెన్సులకు రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. మున్సిపాలిటీలో ఏ కాంట్రాక్టరు అయినా నెలకు లక్షల్లో అవినీతి బ్రదర్స్‌కు కప్పం కట్టాల్సిందే. లేదంటే అతని బిల్లులు ఆపేయడం, అక్రమంగా తొలగించడం వంటివి సర్వసాధారణం. మున్సిపాలిటీ ల్లో జరిగే టెండర్లలో కూడా పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. టీడీపీ హయాంలో ఎక్కడా ఎక్సెస్ టెండర్లు నమోదు కాలేదు. ఇప్పుడు 20శాతం పైనే ఎక్సెస్‌తో టెండర్లు ఆమోదించి కోట్ల అవినీతికి తెరలేపారు.

### కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు వసూలు

నందిగామ నుంచి కంచికచర్ల వరకు హైవే విస్తరణ పనులు చేపట్టినప్పుడు కాంట్రాక్టర్‌ను బెదిరించి రూ.20 కోట్లు వసూలు చేశారు. నందిగామలో రోడ్డు విస్తరణ పనులు, కంచికచర్ల, పెద్దాపురం రోడ్డు నిర్మాణ సమయంలో కూడా కాంట్రాక్టర్ల దగ్గర నుంచి కోట్ల రూపాయల డబ్బులు గుంజారు. తెలుగుదేశం పార్టీ హయాంలో రూ.87 కోట్లతో నందిగామ టౌన్ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చేపట్టిన తాగునీటి ప్రాజెక్టుకు టెండర్లు కూడా పూర్తిచేసి కాంట్రాక్టర్‌ను కూడా ఎంపిక చేశారు. ఎన్నికలు రావడంతో పనులు చేపట్టలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన మొండితోక బ్రదర్స్ ఆ టెండర్లను రద్దు చేసి రెండేళ్లపాటు కాలయాపన చేశారు. చివరికి అదే మొత్తానికి కాంట్రాక్టర్లను ఎంపిక చేసి రూ.17 కోట్లు డబ్బులు వసూలు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు కోడిగుడ్లు, చిక్కీలు సరఫరా చేసే కాంట్రాక్టర్‌ను ఇంటికి పిలిపించి బెదిరించి నెలకు రూ.2 లక్షలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేయడంతో అతను కాంట్రాక్టు వదిలేసి పారిపోయాడు. మరో అసమర్థుడిని తీసుకొచ్చి నెలకు రూ.లక్ష తీసుకుంటూ నాసిరకం పదార్థాలను సరఫరా చేస్తున్నారు.

### టీటీడీ టిక్కెట్లూ అమ్మకం

కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కోటా కింద ఇచ్చే సిఫారసు లేఖలను కూడా నయీం సోదరులు బేరానికి పెట్టారు. ఒక్కో లెటర్ రూ.10 వేల చొప్పున విక్రయించిన విషయం టీటీడీ విజిలెన్స్ అధికారులు నిర్వహించిన సోదాలో బట్టబయలైంది. మంత్రి పెద్దిరెడ్డిని పట్టుకుని లాబీ యింగ్ చేసి కేసునుంచి తప్పించుకోవడం కొసమెరుపు.

### అవినీతి శాఖలకు అనధికార మంత్రివర్గం

అవినీతి దందా సజావుగా సాగేందుకు వీలుగా - ఇక్కడ అనధికార కేబినెట్ రూపుదిద్దుకుంది. అధికా రుల నుంచి, ప్రజలనుంచి, అవినీతి కార్యకలాపాల నుంచి డబ్బులు వసూలు చేసే బాధ్యతను నలుగురు కాలకేయ మంత్రులే నిర్వహిస్తారు. చెరపట్టిన వంద లాది ఎకరాల భూములను, గ్రానైట్ కొండల తవ్వకాల ను, కబ్జాల పర్వాలను సమన్వయం చేసేది కూడా వీళ్లే.

1. బొల్లినేని శ్రీనివాసరావు, లింగాలపాడు: ఇసుక అక్రమ రవాణాలో కీలక బాధ్యతలు పోషిస్తాడు. ఇసుక రీచ్‌లనుంచి డబ్బులు వసూలు చేసి చీకటి పడక ముందే మొండితోక సోదరులకు అప్పగిస్తాడు. ఇతని భార్య సర్పంచ్.
2. పారుపల్లి హరి, లింగాలపాడు: కొండల్ని తవ్వి గ్రావెల్ అమ్మకాలతోపాటు పేకాట క్లబ్బుల నిర్వహణ బాధ్యత ఇతగాడిది.
3. బాబి: గోదావరి జిల్లాల నుంచి నందిగామకు తరలివచ్చి చిన్న సైజు షాడో ఎమ్మెల్యేలా వ్యవహరిస్తుంటాడు. పేకాట క్లబ్బుల నిర్వహణ, దందాలు, కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు వసూలు చేసే కీలక బాధ్యత చూస్తుంటాడు.
4. మార్త శీను, పరిటాల: ఇతని భార్య మార్కెట్ యార్డు చైర్మన్. మార్కెట్ యార్డులో దోపిడీ దగ్గర నుంచి రేషన్ బియ్యం అమ్మకాల వరకు అన్నింటిలోనూ ఇతని ప్రమేయం ఉంటుంది.

# వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయం

**- పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలోకి చేరికలు**



పుట్టపర్తి (చైతన్యరథం): వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమని, వైసీపీ ఐదేళ్ల పాలన చూసి ప్రజలు విసిగిపోయారని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం అమడగూరు మండలంలోని కస్సముద్రం, నిలువురాతిపల్లికి చెందిన 50 కుటుంబాలు పల్లె ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ... ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్... రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని, వ్యవస్థలను విధ్వంసాలను చేసి ఆటలాడుతున్నారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో ల్యాండ్, శ్యాండ్, మైన్లలో పెద్దఎత్తున దోపిడికి గురైయ్యాయని, ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడుతూ రాష్ట్రాన్ని అరాచకప్రదేశ్ గా మార్చేశారని ధ్వజమెత్తారు. సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని జగన్ రెడ్డి అండ్ కో లూటీ చేస్తున్నారని రూ. 10 ఇచ్చి రూ. 100 దోచుకుంటున్నారని అన్నారు. చెప్పిన అబద్ధాలనే పదే పదే చెబుతూ ప్రజల్ని మోసం చేస్తున్నారని... జగన్మోహన్ రెడ్డి మోసాన్ని ప్రజలు గ్రహించారని రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం టీడీతోపే సాధ్యమని ప్రజలు భావిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని పల్లె రఘునాథ్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సైకో పాలనలో రోడ్డున పడ్డ కార్మికులు

**కర్నూలు జిల్లాలో పర్యటించిన కార్మిక చైతన్య బస్సు యాత్ర**



కర్నూలు (చైతన్యరథం): ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన సైకో పాలనలో కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడ్డారని, బాబు ష్యూరిటీ - కార్మికుల భవిష్యత్తు గ్యారెంటీ, అహంకారి పోవాలి... ఆత్మగౌరవం రావాలి అని నినదిస్తూ రాష్ట్ర టీఎన్టీయూసీ అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు ఆధ్వర్యంలో టెక్కలి నుంచి కుప్పం వరకు చేపట్టిన చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్ర గురువారం కర్నూలు జిల్లాలో పర్యటించింది. కర్నూలు, డోన్ నియోజకవర్గాల్లో సాగిన ఈ పర్యటనలో ఎన్టీయూసీ నేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు. మొదటిగా కర్నూలు నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ కు నివాళులర్పించిన అనంతరం టీఎన్టీయూసీ నేతలు మౌర్య ఇన్ దగ్గర నుంచి ఐదు రోడ్ల జంక్షన్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం కార్మికులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికుల సంక్షేమం కోసం టీడీపీ తీసుకొచ్చిన అనేక పథకాలను జగన్ ప్రభుత్వం రద్దు చేసిందని, వైసీపీ హయాంలో కార్మికులకు భరోసా లేకపోవడంతో వారి కుటుంభాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కార్మికులు సంఘటితమై వైసీపీ ఓడించాలని పిలుపునిచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికుల ఉపాధి పెద్దఎత్తున కల్పిస్తామని రఘురామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు

**మాజీ మంత్రి పరిటాల సునీత**

**- ఇప్పటికే రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి**

**- అభివృద్ధి సంక్షేమం కావాలంటే చంద్రబాబు మళ్లీ రావాలి**



రాప్తాడు (చైతన్యరథం): చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ పరిధిలోని రాచానపల్లి, బిఎస్ఆర్ కాలనీ, ఎస్సీకాలనీ, దోబీ కాలనీ, పరిటాల రవీంద్ర కాలనీలలో ఆమె పర్యటించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు కలిసి ఇంటింటికి వెళ్లి మినీ మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ఏ ఇంట్లో ఎంతమందికి ఎంత లబ్ధి చేకూరుతుందన్నది వివరించారు. ముఖ్యంగా మహిళలకు సంబంధించి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, నెలకు 1500 రూపాయల ఆర్థిక సాయం, ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్న అమ్మకు వందనం వంటి పథకాల ద్వారా ఎంతో మేలు జరగనుందన్నారు. అలాగే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగాలు వచ్చేంతవరకు నిరుద్యోగ భృతి రైతులకు ప్రతి ఏటా 20 వేల రూపాయలు ఆర్థిక సాయం, బీసీల కోసం రక్షణ చట్టం వంటి పథకాల గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలు జనంలోకి బాగా వెళ్లాయని వాటిపై హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రూరల్ మండల పరిధిలో అసలు అభివృద్ధి ఏ మాత్రం కనిపించడం లేదని.. ఎక్కడికక్కడ సమస్యలు తిష్ట వేశాయన్నారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే హడావిడి చేయడం తప్ప.. ఈ ఐదేళ్లలో చేసిందేమీ లేదన్నారు. మరోవైపు రాష్ట్రంలో పరిస్థితిలు దారుణంగా తయారయ్యాయని.. సామాన్యుడు బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అభివృద్ధి లేకుండా రాష్ట్రం అధోగతిపాలైందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చంద్రబాబు మాత్రమే రాష్ట్రాన్ని కాపాడగలరన్నారు. రాష్ట్రానికి అభివృద్ధి సంక్షేమం కావాలంటే మళ్లీ ఆయన్ని ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. రాప్తాడులో అరాచకాలకు అడ్డుకట్ట వేసి.. అభివృద్ధి జరగాలంటే తెలుగుదేశం పార్టీ గెలవాలని సునీత అన్నారు.

# రాయదుర్గం నుంచే పోటీ చేస్తా.. కాలవ స్పష్టీకరణ



రాయదుర్గం (చైతన్యరథం): రాయదుర్గం నియోజకవర్గం నుంచే తాను శాసనసభకు పోటీ చేస్తానని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం ఆయన రాయదుర్గం నివాసంలో హెచ్. సిద్దాపురం తాండాకు చెందిన పలువురిని కండువాలు వేసి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పలు రకాల వదంతులు రావడం సర్వ సాధారణమన్నారు. తాను ఎంపిగా వెళ్తానని వస్తున్న ప్రచారాన్ని ఎవరు నమ్మకూడదని తెలిపారు. మరో 15 ఏళ్ల పాటు తాను రాయదుర్గంలోనే ఉంటానని, అత్యంత వెనుక బడిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని తనను చంద్రబాబు నాయుడు పంపించారని కాలవ గుర్తు చేశారు. నియోజకవర్గంలో ఆగిపోయిన అభివృద్ధి కార్యక్రమాలను తాను గెలిచాక పూర్తి చేస్తానన్నారు. ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే తన సంకల్పమన్నారు. దానికి తమ అధినేత చంద్రబాబు నాయుడు ఆశీస్సులు ఉంటాయన్నారు. కాబట్టి ఎవరూ ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని, రాయదుర్గంలో నిలిచేది, గెలిచేది తానే అని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంత రెడ్డి, మకాసి వేంకటేశులు, సంజు నాయక్, డీ.నాగరాజు నాయక్, డీ.తిప్పేస్వామి నాయక్, డీ.కృష్ణ నాయక్, డీ.రామ వల్లి నాయక్, డీ.మంజు నాయక్, డి.దంజునాయక్ పాల్గొన్నారు .

# ఐక్యమత్యంతో ముందుకు సాగుదాం... సైకోను తరిమికొడదాం

**అన్నమయ్య జిల్లా టీడీపీ బీసీసెల్ అధ్యక్షులు సురేంద్రయాదవ్ పిలుపు**



అన్నమయ్య జిల్లా (చైతన్యరథం): వచ్చే ఎన్నికల్లో బీసీలంతా ఐకమత్యంతో ముందుకు సాగుదాం... సైకోను రాష్ట్రం నుంచి తరిమికొడదామని జిల్లా టీడీపీ బీసీసెల్ అధ్యక్షులు సురేంద్రయాదవ్ పిలుపునిచ్చారు. గురువారం పీలేరులోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర బీసీ కార్యదర్శి పురం రామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేంద్రయాదవ్ మాట్లాడుతూ... టీడీపీతోనే బీసీలకు గుర్తింపు వచ్చిందని, బీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం 34% శాతం రిజర్వేషన్లు కల్పించామన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో 10%రిజర్వేషన్లు కుదించి కార్పొరేషన్లు నిర్వీర్యం చేస్తూ బీసీలకు చెందాల్సిన పదవులు పక్కదోవ పట్టించి కూర్చోవడానికి కుర్చీలు లేని కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు లేకుండా చేశారని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి పురం రామ్మూర్తి మాట్లాడుతూ... చంద్రబాబు పాలనలో అభివృద్ధికి చిరునామాగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ను జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో అంధకారంలో నెట్టేశారని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల హక్కుల్ని గౌరవించకుండా జనాభాలో సగ భాగం ఉన్న బీసీలను ఆది నుండి అణగదొక్కుతూ నియంతలా నడిచే ప్రభుత్వానికి ప్రజా విశ్వాసం ఉండదని అన్నారు. బీసీలు సామాజికంగా రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు తెలుగుదేశం పార్టీ ప్రత్యేక చట్టాన్ని అమలు చేయనుందని తెలిపారు. నియోజకవర్గంలో కిషోర్ కుమార్ రెడ్డి, రాష్ట్రంలో చంద్రబాబును గెలిపించు కోవాల్సిన అవసరం ఉందని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ, టీడీపీ, జనసేన మండల బీసీ నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

## ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యం!



- బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో దేవినేని ఉమామహేశ్వరరావు

[illegible]

## విద్యార్థుల భవిష్యత్తుకు ఉరివేసిన జగన్ సర్కార్



- టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు మీర్జా మాజిద్ రాజా మండిపాటు

[illegible]

# టీడీపీ సమగ్ర శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాటి



[illegible]

## ఎస్సీ, ఎస్టీలను అణగతొక్కిన వైసీపీకి సామాజిక సాధికారయాత్ర చేసే హక్కు లేదు



- ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి దళితులకు తీవ్ర అన్యాయం
- దళితులపై దాడులకు ఈ ప్రభుత్వ హయాంలో అంతే లేదు
- మంగళగిరి టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు ఆగ్రహం

[illegible]

## అరాచక పాలనకు ఓటుతోనే బుద్ధి చెప్పాలి

- నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్



[illegible]

## జగన్‌రెడ్డి అప్రజాస్వామిక విధానాలతో ప్రజలు విసుగెత్తిపోయారు

- టీడీపీ జాతీయ కోశాధికారి, శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)



[illegible]

# రాష్ట్ర పరువును దిగజార్చిన వైఎస్. జగన్మోహన్‌రెడ్డి

- వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలి
- చంద్రబాబునాయుడికి అండగా ఉండాలి
- తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్




విజయవాడ తూర్పు (చైతన్యరథం) : జగన్మోహన్‌రెడ్డి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన తర్వాత తీసుకున్న నిర్ణయాలు, అసమర్థ పాలన వల్ల పొరుగు రాష్ట్రాల్లో మన రాష్ట్రం పరువు దిగజారిందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని మొగల్రాజపురంలోని బందులదొడ్డి సెంటర్లో కేశినేని శివనాథ్ (చిన్ని) అందించిన మహిళలకు కుట్టుమిషన్లను, రజకులకు ఇస్త్రీపెట్టెలు, తోపుడుబండ్లను ఎమ్మెల్యే గద్దె రామమోహన్, పార్టీ నాయకుడు కేశినేని శివనాథ్ (చిన్ని) తో పాటుగా జనసేన నాయకులతో కలిసి గురువారం పంపిణీ చేశారు. ఈ సభకు పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు సొంగా సంజయ్ వర్మ అధ్యక్షత వహించారు.

**తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ** వైఎస్. జగన్మోహన్రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు, అసమర్థత పాలన వల్ల పొరుగు రాష్ట్రాల్లో మన రాష్ట్ర పరువును దిగజార్చరని చెప్పారు. రాష్ట్రంలో గంజాయి ఎక్కడ పడితే అక్కడ లభిస్తోందన్నారు. కల్తీ మద్యం తాగి మద్యం తాగే వారు మరణిస్తున్నారని చెప్పారు. గంజాయి తీసుకున్న యువత ఆమత్తులో ఏమి చేస్తున్నారో కూడా తెలియని స్థితిలో ఉన్నారని చెప్పారు. జగన్మోహన్రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో 33 వేల మంది మహిళలు మిస్సింగ్ అయ్యారన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న కల్తీ మద్యం తాగి ఐదు లక్షల మంది మరణించినా ప్రభుత్వం నుంచి ఏవిధమైన చర్యలు లేవన్నారు. చంద్రబాబునాయుడు హాయంలో మహిళలకు టైలరింగ్ లో శిక్షణ ఇచ్చి వారికి ఉచితంగా కుట్టుమిషన్లు అందచేశామని, జగన్మోహన్రెడ్డి అధికారంలోకి వచ్చిన ఈ నాలుగున్నర సంవత్సరాల్లో ఒక్కరికి కూడా కుట్టుమిషన్లు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. కొంత మంది పేదలకు సంవత్సరానికి రూ.15 వేలు ఇచ్చి పేదలందరిని ధనికులను చేశానని జగన్మోహన్రెడ్డి చెప్పుకుంటున్నారని అన్నారు. చంద్రబాబునాయుడు హాయంలో విజయవాడ నగరంలోని ప్రతి ఒక్క కార్మికుడు, ఆటో డ్రైవరు, చిరు వ్యాపారులు రోజుకు రూ.2 వేలు సంపాదించుకునే వారని అన్నారు.

ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అంటే బి.సిల గుండెల్లో నుంచి వచ్చిన పార్టీ అన్నారు. బి.సిలను అభివృద్ధి చేసింది, వారికి రాజకీయంగా ప్రాధాన్యత కల్పించింది దేశంలోనే ఒక రాజకీయ పార్టీ అదికూడా ప్రాంతీయ పార్టీ తెదేపా మాత్రమేనని దేశం మొత్తం చెప్పుకుంటుందన్నారు. తెదేపా స్థాపన తరువాత దేశంలో వెలసిన ఇతర ప్రాంతీయ పార్టీలు తెదేపాను ఆదర్శంగా తీసుకుని ఇతర రాష్ట్రాల్లో బి.సిలకు రాజకీయ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. విద్యా విధానంలో రిజర్వేషన్ తీసుకువచ్చిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. విజయవాడకు అతి సమీపంలో రాజధాని అమరావతి ఉందని, దాన్ని జగన్ ప్రభుత్వం కొనసాగించి నిర్మాణాలు చేసి ఉంటే ఈ ప్రాంతంలోని కార్మికులకు చేతనిండా పనులు ఉండేవన్నారు. అమరావతిని నిర్వీర్యం చేయడంతో ఎంతో మంది రోజువారి పనుల కోసం ఎదురుచూస్తున్నారన్నారు.

జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ ఒక్క అవకాశం అడిగాడు కదా అని జగన్ను గెలిపిస్తే బడుగు బలహీన వర్గాలు, బి.సిల వెన్ను విరిచిన వ్యక్తి జగన్ అన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో బి.సి కార్పొరేషన్ నుంచి లోన్లు ఇచ్చారని, జగన్ ప్రభుత్వంలో బి.సిలను కులాల వారీగా విడదీసి, వాటికి తన పార్టీ వారిని కార్పొరేషన్ చైర్మన్లుగా నియమించి వారికి ప్రజాధనంతో జీతాలు మాత్రమే ఇస్తున్నారు గాని, బి.సి ప్రజలకు మాత్రం ఎటువంటి లోన్లు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే పవన్ కళ్యాణ్ చంద్రబాబుకు మద్దతు తెలిపారని, జగన్ను దించితేనే బి.సిలతో పాటు అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. జగన్ పార్టీ వారు సిద్ధం అంటూ బ్యానర్లు పెడుతున్నారని, ఏమి చేశారని సిద్ధం అంటున్నారని ప్రశ్నించారు. జగన్ ను గద్దె దించేందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కొక్కెర తిరుపతయ్య, పేరేపి ఈశ్వర్, రాయి రంగమ్మ, సిద్దెం నాగేంద్రరెడ్డి, పోలిపల్లి ముని, మైలమూరి పీరుబాబు, గోగుల రమేష్, పలిశెట్టి అన్నారావు, గొరిపర్తి నామేశ్వరరావు, వల్లూరు మధు, మొకర రమణ, రాధారపు యల్లబాబు, మొకర ఆదిబాబు, కోడూరు సుబ్రమణ్యం, జనసేన నాయకులు గాదిరెడ్డి అమ్ములు, వటాల హరి ప్రసాద్, చందు శివరామప్రసాద్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు గుదిబండగా మారిన వైసీపీ ప్రభుత్వ విధానాలు

- సెంట్రల్ టీడీపీ మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు
- 59వ డివిజన్‌లో సర్వసభ్య సమావేశం
- రాబోవు ఎన్నికలకు అందరూ అప్రమత్తంగా ఉండాలి



విజయవాడ (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వ విధానాలే ప్రజలకు గుదిబండగా మారాయని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ఆరోపించారు. సెంట్రల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 59వ డివిజన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ పోలీట్ బ్యూరో సభ్యులు సెంట్రల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు హాజరయ్యారు.. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ.. ఎన్నికలు మరొక 70 రోజుల్లో జరగబోతున్నా యని అందరూ కూడా అప్రమత్తంగా ఉండాలని ఈ వైసీపీ ప్రభుత్వం ఏదైనా చేస్తుందని కాబట్టి 59వ డివిజన్ పరిధిలో ఓట్లు సరి చూసుకోవడం అలాగే తెలుగుదేశం పార్టీ జనసేన ప్రకటించినటువంటి మినీ మేనిఫెస్టో ఆరు పథకాలను ప్రజలకు చేరువయ్యేలా చేయడం ప్రతినిత్యం ప్రజల్లో ఉంటూ తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎలా మేలు జరిగింది. ఈ వైసీపీ పార్టీ అధికారంలోకి వచ్చినాక ప్రజలు ఏవిధంగా నష్టపోయింది ప్రజలకు ప్రతి ఒక్కరూ వివరించాలని సూచించారు. ఈ నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలల కాలంలో చాలామంది నాయకులు కష్టపడి పని చేశారని కొంతమంది ఉద్యోగాలు నిమిత్తం వ్యాపారాలు నిమిత్తం పార్టీకి ఎక్కువ సమయంలో వెచ్చించలేకపోయారని కానీ ఇప్పుడు కూడా అందరూ ప్రజల్లోనే ఉండాలని ఎన్నికలు అయ్యేదాకా తెలుగుదేశం పార్టీ విజయం కోసం నారా చంద్రబాబు నాయుడుని మరలా ముఖ్యమంత్రిని చేయడం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు...

ఈరోజు వైసీపీ ప్రభుత్వం వచ్చినాక నిత్యవసర ధరలు, గ్యాస్ ధరలు,పెట్రోల్ ధరలు, డీజిల్ ధరలు అన్ని రకాలుగా పెంచి సామాన్యుడిని బతుకును చిన్నాభిన్నం చేశారని తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిరుపేదలు సామాన్యులు దిగువ మధ్య తరగతికి చెందినవారు వారి కుటుంబంతో చాలా ఆనందంగా గడిపేవారు అని ఈరోజు ప్రజలకు తెలుగుదేశం పార్టీ వైసిపి మధ్య వ్యత్యాసం ప్రజలకు చెప్పినట్లయితే వారే ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకుంటారని తెలిపారు..

ఈ వైసీపీ ప్రభుత్వ విధానాలే ప్రజలకు గుదిబండగా మారాయని సాఫీగా జరిగిపోయే ఇసుకను ఆపి కొత్త విధానాన్ని ప్రవేశ పెట్టడం ద్వారా లక్షలాదిమంది భవన నిర్మాణ కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారని ఈ జగన్మోహన్ రెడ్డి జాబ్ క్యాలెండర్ను ప్రకటిస్తామని చెప్పి నిరుద్యోగులను విద్యార్థులను నిట్టనిలువుల మాసగుందారని అన్నా క్యాంటీన్ ను ఎత్తివేసి బీద బడుగు బలహీన చిరు వ్యాపారులకు మధ్యాహ్నం భోజనం లేకుండా చేశారని సమాజంలో అన్ని వ్యవస్థల మీద అందరి వ్యక్తుల మీద అన్ని వర్గాల మీద దెబ్బ కొట్టినది ఈ వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం మని దుయ్యబట్టారు..

కాబట్టి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం చారిత్రాత్మక అవసరమని, నారా చంద్రబాబునాయుడు పాలన తో మరల తిరిగి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాత రోజులు తిరిగి వస్తాయని ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో అందరికీ వివరించాలని రాబోయేది తెలుగుదేశం జనసేన కోటమీదే అని చాటి చెప్పాలని తెలిపారు..

ఈ డివిజన్ పరిధిలో నియోజకవర్గ పరిధిలో జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి పని చేయాలని సూచించారు, నిన్న విస్తృతస్థాయి సమావేశంలో ఇచ్చినటువంటి కొత్త ఓటర్ లిస్ట్ ను ప్రతి ప్రజల్లోకి వెళ్లి ఓట్లు ఉన్నవో లేవో చూసి వారి బాధ్యతను వారికి గుర్తుచేయాలని ఎన్నికలకు వారం రోజులు ముందు వరకు కూడా కొత్తగా ఓటు హక్కును నమోదు చేసు కునేటువంటి అవకాశం ఎలక్షన్ కమిషన్ కల్పించింది అని తెలిపారు ఇకనుండి ప్రతి 10 రోజులకు ఒకసారి డివిజన్ మీటింగులు జరుగుతుందని డివిజన్ మీటింగ్లో ఆ పది రోజులకు జరిగినటువంటి పరిణామాలను చర్చించుకుందాం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు,ఘంటా కృష్ణమోహన్,డివిజన్ అధ్యక్షులు బంగారు నాయుడు ,జాన్ వళి, దివి ఉమామహేశ్వరరావు, ఫర్విన్,నందేటి ప్రేమ్,మరక శ్రీను,ఇందిరా,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా ఆధ్వర్యంలో కూరగాయల పంపిణీ


- మాజీ చైర్ పర్సన్ గద్దె అనురాధ



విజయవాడ తూర్పు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ 22వ డివిజన్ ఆధ్వర్యంలో డివిజన్ లోని మహిళలకు ఉచితంగా కూరగాయల పంపిణీ కార్యక్రమం గురువారం సాయంత్రం జరిగింది. ఈ కూరగాయల పంపిణీ కార్యక్రమానికి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ గద్దె అనురాధ హాజరై మహిళలకు కూరగాయలు పంపిణీ చేశారు. 700 మందికి మహిళలకు ఈ రోజు కూరగాయలు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం గద్దె అనురాధ పుట్టిన రోజు సందర్భంగా డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఏర్పాటు చేసిన కేకును గద్దె అనురాధ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ.. ప్రస్తుత వైకాపా ప్రభుత్వం పెరిగిన కూరగాయల ధరలను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు కొంత భారం తగ్గించేందుకు తెలుగుదేశం పార్టీ 22వ డివిజన్ అధ్యక్షుడు పలిశెట్టి అన్నారావు ఆధ్వర్యంలో ప్రతి నెలా 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు సుమారు 2 వేల మంది మహిళలకు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేదాకా కూరగాయలు పంపిణీ చేయాలనే ఉద్దేశ్యంతో ఈ విధంగా ఉచితంగా కూరగాయలు పింపిణీ చేయడం జరుగు తుందన్నారు.

జగన్ పాలనలో అత్యధికంగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది మహిళలే అన్నారు. ఈ కార్యక్రమం నిర్వహి స్తున్న పలిశెట్టి అన్నారావు మరియు డివిజన్ తెలుగు దేశం పార్టీ వారిని గద్దె అనురాధ అభినందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షులు పలిశెట్టి అన్నారావు, వేముల దుర్గారావు, మడ్డి మాధవి, చింతాడ శారద, పెద్దపల్లి వెంకట రాజు, బంగారమ్మ, మురళీ, మల్లేశ్వర రావు, జ్ఞాన దుర్గాప్రసాద్, యాళ్ల వైకుంఠం, అడపాక నర్సి, దత్తులూరి కాసీం తదితరులు పాల్గొన్నారు.

## కందుల ఆధ్వర్యంలో భవిషత్ గ్యారంటీ కార్యక్రమం



మార్కాపురం (చైతన్యరథం): మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పొదిలి మండలంలో గొల్లపల్లి "భవిష్యత్తుకు గ్యారంటీ" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు, టిడిపి ఇన్చార్జ్ కందులు నారాయణరెడ్డి ఆయన తనయుడు విగ్నేష్ రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ తెలుగుదేశం పార్టీ సూపర్సిక్స్ పథకాల గురించి వివరించారు.ప్రతిఒక్కరి కష్టాలు తీరాలి అంటే తెలుగుదేశం జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే సాధ్యం అని టిడిపి ఇన్చార్జ్ కందుల నారాయణరెడ్డి తెలిపారు. నలభై సంవత్సరాలు విలువలతో కూడిన రాజకీయాలకు పెట్టిందే పేరు చంద్రబాబు నాయుడని వారిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని ఆయన అన్నారు.

చైతన్యరథం

# నిధుల సాధనలో వైసీపీ ప్రభుత్వం విఫలం

- 31 మంది ఎంపీలు ఉండి సాధించింది శూన్యం
- ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వైసీపీ ఎంపీలు కేంద్రంపై పోరాటం చేయాలి
- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహాక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ

అమరావతి (చైతన్యరథం): 2024లో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి 10 ఏళ్ల కాలపరిమితి ముగుస్తున్నా రాష్ట్రానికి నిధుల సాధనలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహాక కార్యదర్శి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ నేత మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 5 ఏళ్లలో వైసీపీ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రం అన్ని రంగాల్లో తీవ్రంగా నష్టపోయిందని, 25 మంది ఎంపీలు ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హెూదా తెస్తానని ఉత్తరకుమార ప్రగల్భాలు పలికిన జగన్‌రెడ్డి... 31 మంది ఎంపీలను పెట్టుకుని రాష్ట్రానికి ఏం సాధించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గుంటూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రత్యేకహెూదా, విభజన హామీలు, దుగరాజపట్నం పోర్టు, పోలవరం ప్రాజెక్ట్‌కు తగిన నిధులు, నిర్వాసితులకు నష్టపరిహారంగా పునరావాసం కల్పన వంటి అంశాలపై కేంద్ర బడ్జెట్ నుంచి నిధులు సాధనలో జగన్ ఎంపీలు పూర్తిగా విఫలం చెందారని అన్నారు. విశాఖపట్నం కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటుకు కేంద్రం 53 ఎకరాల భూమిని కేటాయించాలని రాష్ట్ర



ప్రభుత్వాన్ని కోరిన... జగన్ ప్రభుత్వం ఇప్పటికీ ఆ భూమిని అప్పగించకపోవడం ముమ్మాటికి మీ నిర్లక్ష్యం కాదా? అని ప్రశ్నించారు. భూమి ఇస్తే పనులు మొదలు పెడతామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటన చూసి వైసీపీ నాయకులు సిగ్గుపడాలన్నారు. విభజన చట్టంలో కేటాయించిన 11 జాతీయ విద్యా సంస్థలను తెలుగుదేశం ప్రభుత్వం తీసుకొస్తే వాటికి నిధులు కూడా తేలేకపోవడం జగన్ రెడ్డి వైఫల్యం కాదా? అని నిలదీశారు.

కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్ర వాటా నిధులు కూడా ఇవ్వలేక వేల కోట్ల కేంద్ర నిధులను నిరుపయోగం చేయడం తప్ప జగన్ రెడ్డి చేసింది శూన్యమని మన్నవ ధ్వజమెత్తారు. ఏపీకి ప్రత్యేకహెూదా సాధనకు కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేం దుకు ఈ బడ్జెట్ సమావేశాలు చక్కటి అవకాశమని... వైసీపీ నాయకులకు రాష్ట్రం పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా... రాష్ట్రానికి ప్రత్యేకహెూదా, విజభన హామీల సాధనకే కేంద్రంపై పోరాటం చేయాలని మన్నవ మోహనకృష్ణ వైసీపీ ప్రభుత్వానికి సూచించారు.

## కేశినేని నాని ఎంపీ పదవికి పోటీ చేస్తే ఓడిపోవడం ఖాయం!

- నానిపై విరుచుకుపడ్డ కేశినేని చిన్ని



అమరాతి (చైతన్యరథం) : విజయవాడ ఎంపీ, వైఎస్ఆర్‌సిపి నేత కేశినేని నానిపై అయన సోదరుడు, టీడీపీ నేత కేశినేని చిన్ని మరోసారి విరుచుకు పడ్డారు. కేశినేని నానికి విశ్వాసం లేదని అయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేశినేని నాని వైసీపీలో చేరడంతో.. సైకోలందరూ ఒకే చోటకు చేరినట్టయిందని అన్నా రు. విజయవాడ లోక్ సభకు కేశినేని నాని పోటీ చేస్తే కచ్చితంగా 3 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోతాడని జోస్యం చెప్పారు. అయితే, విజయవాడ టికెట్ ను నానికి ఇచ్చే అంశంలో వైఎస్ఆర్‌సిపి నాయకత్వం ఇంత వరకు ఎలాంటి హామీ ఇవ్వలేదని అన్నారు. టీడీపీలో ఉన్నప్పుడు కేశినేని నానికి చాలా గౌరవం ఉండేదని.. వైసీపీలోకి వెళ్లిన తర్వాత ఆయన స్థాయి దిగజారిందని చిన్ని చెప్పారు. దేవినేని అవినాశ్ కు ముఖ్య అనుచరుడిగా నాని మారారని ఎద్దేవా చేశారు. విజయవాడ నుంచి తాను బరిలోకి దిగే అంశాన్ని పార్టీ హైకమాండ్ చూసుకుంటుందని చెప్పారు. ఎక్కడి నుంచి పోటీ చేయాలని తమ నాయ కత్వం సూచిస్తుందో.. అక్కడి నుంచి పోటీ చేస్తానని తెలిపారు. టికెట్ల కేటాయింపులపై తమ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ చర్చిస్తారని చెప్పారు. కేశినేని నానిపై పోటీకి తాను సిద్ధమని అన్నారు.

# బీసీలపై జగన్ రెడ్డి దుర్మార్గాలు ఎదురిద్దాం !



- బతుకులపై దెబ్బ కొట్టిన వైసీపీకి బీసీల సత్తా ఏంటో చాటి చెబుదాం
- 'జయహెూ బీసీ' సభలో నిప్పులు చెరిగిన మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు

పామర్రు (చైతన్యరథం): జగన్‌రెడ్డి పాలనంతా బీసీల బతుకుల్ని బుగ్గి చేయడమే అన్నట్లు సాగిందని మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు ధ్వజమెత్తారు. నాలుగున్నరేళ్ల పాలనలో బీసీలకు జగన్‌రెడ్డి చేసిన మేలేమీ లేకపోయినా.. వారి హక్కుల్ని, అధికారాల్ని లాక్కుని వారి జీవితాలను నాశనం చేశాడని మండిపడ్డారు. చంద్రబాబు బీసీల బతుకులు బాగుపడాలని చూస్తే.. జగన్‌రెడ్డి వారి శవాలపై నుండి తన కోటకు పునాదులు వేసుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తోట్లవల్లూరు మండలం కుమ్మమూరు గ్రామంలో 'జయహెూ బీసీ ' సభలో జగన్ రెడ్డి దుర్మార్గాలపై ఆయన నిప్పులు చెరిగారు. జగన్‌రెడ్డి కుట్రలు, కుతంత్రాలకు బలైంది చాలు. ఇక కదలి రండి.. కదం తొక్కుదాం. జగన్ రెడ్డి అరాచక పాలనకు చరమగీతం పాడుదాం అంటూ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాజకీయంగా ఎదుగుదల కోసం అన్న ఎన్టీఆర్ కల్పించిన స్థానిక సంస్థల రిజర్వేషన్లను కుదించి 16,800 మందికి అవకాశాలు దూరం చేయడమే కాకుండా... రూ.75 వేల కోట్ల సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించారని అన్నారు. బీసీలకు చెందిన 8వేల ఎకరాల అసైన్డ్ భూములు బలవంతంగా లాక్కున్నారని, బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయకుండా మోసం చేశారని తెలిపారు. ఎమ్మెల్యేల మార్పుల్లోనూ బీసీలను బలిపశువుల్ని చేస్తున్న జగన్‌రెడ్డిని రాష్ట్రం నుండి తరిమికొట్టాలని, చరిత్రలో ఏ రాజకీయ నాయకుడూ, ఏ ప్రభుత్వమూ చేయనంతటి దగా జగన్ రెడ్డి బీసీలకు చేశారని అన్నారు. స్టడీ సర్కిల్స్, స్కిల్ డెవలప్మెంట్, విదేశీ విద్య లాంటి పథకాలు రద్దు చేసి బీసీలకు చదువులు దూరం చేశారని, స్వయం ఉపాధి రుణాలు, పారిశ్రామిక రాయితీలు రద్దు చేసి ఆర్థికంగా ఎదగనీయకుండా చేస్తున్నాడని దుయ్యబట్టారు. స్థానిక సంస్థల్లో అవకాశాలు దూరం చేయడంతో పాటు... నామినేటెడ్ పదవుల్లో సొంత వారిని నియమించుకుని, ఎమ్మెల్యేలపై సొంత వర్గాన్ని షాడోలుగా నియమించి పెత్తనం చెలాయిస్తున్నారని నిప్పులు చెరిగారు. పేదల పక్షపాతినంటూ నంగనాచి కబుర్లు చెబుతున్న జగన్ కు బీసీల సత్తా ఏంటో.. బీసీలు తలచుకుంటే ఎలా ఉంటుందో చూపించాల్సిన సమయం ఆసన్నమైందని కొనకళ్ల నారాయణరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అథితిగా కొనకళ్ళ నారాయణ, బచ్చుల బోసు, రాష్ట్ర బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, సూకాలమ్మ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వంలో చేనేతలకు ఆదరణ కరువు

- మాజీ ఎమ్మెల్యే వర్మ




పిఠాపురం (చైతన్యరథం) : వైసీపీ ప్రభుత్వంలో చేనేతలకు సరైన ఆదరణ కరువని, సబ్సిడీ కూడా అందడంలేదని మాజీ ఎమ్మెల్యే వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప్పాడ కొత్తపల్లి మండలం కొత్తపల్లి పంచాయితీ రవీంద్రపురం గ్రామంలో నేడు మాజీ ఎమ్మెల్యే వర్మ అధ్యక్షతన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం, మన ఇంటికి మన వర్మ ఆశీర్వదిద్దాం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ.. ఇక్కడ వీవర్స్ కుటుంబాలు ఎక్కువగా ఉంటారు, చేనేతకు సరైన ఆదరణ ఉండడం లేదు, ఇక్కడ గల జామ్దని చీరలను నేస్తుంటే చూడడం జరిగింది. నేతకు వచ్చేది నేస్తే 2 వేల రూ.లని . నేటి వైసీపీ ప్రభుత్వం మార్కెట్ సదుపాయాలు కలిపించడం లేదని, వీరందరికీ కూడా అవగాహన కలిపించాలని, చంద్రబాబు వీవర్స్ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, గతంలో నూలుకి ఇచ్చే సబ్సిడీ వారికీ అందేలా పోరాడడం జరిగింది. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో నేరుగా చంద్రబాబు నాయుడుకి చూపిం చడం జరిగింది. వర్షాకాలంలో నేత నేస్తున్నప్పుడు దీనికి సంబందించిన గోతులు మునిగిపోతాయో ఆ కాలంలో నేతకు ఇబ్బంది కర పరిస్థితి ఉంటుందన్నారు. కాబట్టి మత్స్యకారులుకు ఏ విధంగా సంక్షేమం అందుతాయో అదే విధంగా వీరికి వర్తించేలా ఒక జి.ఓ ఇవ్వడం జరిగింది. తదనంతరం ప్రభుత్వం అధికారం కోల్పోయినప్పుడు వీవర్స్ కి చెందినా జి.ఓను ఈ వైసీపీ ప్రభుత్వం అమలు చేయకుండా ఉండదంతో వర్షాకాలంలో చాలా ఇబ్బందులు ఎదురుకుంటున్నారని, రాబోయే రోజుల్లో చేనేత కుటుంబాలను మార్కెట్ సదుపాయం కలిపించడంతో పాటుగా అన్ని సబ్సిడీలు వర్తించేలా చేస్తామన్నారు. అదే విధంగా ఇంటికి లోన్ సదుపాయం కలిపించినప్పుడు, మగ్గం నేచుకోడానికి ఉన్న షెడ్డు కూడా కలిపి లోన్ ఇచ్చే విధంగా తెలుగుదేశం ప్రభుత్వం ఒక ఆలోచన చేస్తుందని, రాబోయే రోజులో చేనేతే కార్మికులు ఆర్థికంగా ఎదగడానికి తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందని తెలిపారు.

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు అమలు అవుతాయని, ప్రజలందరూ వైసీపీ పార్టీని తరిమికొట్టి చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేయాలనీ కోరారు. ఎలక్షన్ ముందు వచ్చే పొన్నూరు వారి మాటలు నమ్మి ప్రజలు మోసపోకండి, వారి వచ్చేది అధికారం కోసం, ఆర్థికంగా ఎదగడానికి తప్ప నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయరని ఆయన తెలిపారు. స్థానికునిగా 20 సం.లుగా మీతో ఉంటూ, మీ కష్టాలలో, సమస్యలు పై నిరంతరం పోరాడుతూ పరిష్కారం అయ్యేలా చేస్తున్న నన్ను ఒక్కసారి ఆశీర్వదించండని, నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిశెట్టి సత్యానంద రెడ్డి, సానా కృష్ణ, నంపల ఈశ్వర రావు, దంపుడుబియ్యం రాజు, పెనుమర్తి అప్పారావు, రావు అక్షయ్, మరియు ఉప్పాడ, అమీనా బాద్ మత్స్యకార నాయకులు, వాకతిప్ప గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాపుల ద్రోహి జగన్ రెడ్డి

- ముత్తుముల సమక్షంలో వైసిపిని వీడి టీడీపీలో చేరిన సంగా వీధి కాపు సోదరులు



గిద్దలూరు (చైతన్యరథం): నాదు తెలుగుదేశం హయాంలో కాపు సోదరులకు కల్పించిన 5% శాతం రిజర్వేషన్లు రద్దు చేసిన కాపుల ద్రోహి జగన్ రెడ్డి అని నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి ఆగ్రహాం వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా, కంభం పట్టణంలోని సంగా వీధిలో స్థానిక టీడీపీ నాయకులు గుడిమెట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్ రెడ్డి సమక్షంలో సంగా వీధికి చెందిన కాపు కుటుంబాలు వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి టీడీపీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. నాదు తెలుగుదేశం హయాంలో కాపు సోదరులకు కల్పించిన 5% శాతం రిజర్వేషన్లు రద్దు చేసిన కాపు ద్రోహి జగన్ రెడ్డి అని రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని గిద్దలూరు నియోజకవర్గంలో తెలుగుదేశం జనసేనల ఉమ్మడి అభ్యర్థి అయిన నా గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వైసీపీని తెలుగుదేశం పార్టీలో చేరిన సంకుల చిన్న మస్తాన్ రావు, కొండా వెంకటేశ్వర్లు, దొలూరి వెంకటేశ్వర్లు, దొలూరి శ్రీనివాసులు, మేడిగారి ప్రసాద్, సంకుల శ్రీనివాసులు, వార్డు మెంబర్ కంటా రంగలక్ష్మి, రిటైర్డ్ ఎస్సై కొండయ్య, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తోట శ్రీను ప్రధాన కార్యదర్శి అరెపల్లి మల్లిఖార్జున, రాష్ట్ర కాపు జేఏసీ పొలిటికల్ కన్వీనర్ దుత్తా బాల ఈశ్వరయ్య స్థానిక టీడీపీ నాయకులు తోట రంగనాయకులు, దొలూరి వాసు, తాటిశెట్టి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో ప్రకటించిన
# కొత్త పథకాలు

ఢిల్లీ: కేంద్ర తాత్కాలిక బడ్జెట్‌ను గురువారం ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ రెండు కొత్త పథకాలను ప్రవేశ పెట్టారు. కోటి కుటుంబాలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. అదేవిధంగా మధ్య తరగతి ప్రజల సొంతింటి కలను నిజం చేసేందుకు ఒక ప్రత్యేకగృహనిర్మాణ పథకాన్ని ప్రకటించారు. ఇదే కాకుండా 9 నుండి 18 ఏళ్లలోపు బాలికల్లో సర్వైకల్ కాన్సర్ సమస్యను పరిష్కరించేందుకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని అమలుచేస్తామని ప్రక టించారు. కొత్తగా మెడికల్ కాలేజీలకు కూడా అనుమతులు ఇస్తామని తెలిపారు.



### కోటి కుటుంబాలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

బడ్జెట్‌లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతా రామన్ కీలక ప్రకటన చేశారు. కరెంటు కష్టాలు లేని దేశ నిర్మాణానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దేశంలోని కోటి ఇండ్లపై రూఫ్ టాప్ సిస్టమ్‌ను బిగించనున్నట్లు తెలిపారు. దాంతో ప్రతి నెలా 300యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ఆయా కుటుంబాలు పొందగలుగుతాయన్నారు. దీంతో ప్రతి కుటుంబానికి ఏటా 15 వేల నుంచి 18వేల వరకు ఆదా అవుతుందని చెప్పారు. వినియోగించు కోని విద్యుత్‌ను పంపిణీ సంస్థలకు విక్రయించు కోవ చ్చని చెప్పారు. ఈ పథకానికి సంబంధించిన పనులు త్వరలోనే వేగవంతం చేస్తామని ప్రకటిం చారు.



### మధ్య తరగతికి కొత్తగా గృహ నిర్మాణ విధానం

మధ్య తరగతి కోసం కొత్తగా గృహ నిర్మాణ విధానం తీసుకురాబోతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. పార్లమెంట్‌లో మధ్యంతర బడ్జెట్ ప్రసంగంలో ఈ విషయాన్ని వెల్లడించారు. బస్తీలు, అద్దె ఇండ్లల్లో ఉండే వారి సొంతింటి కలను నెరవేరుస్తామని ప్రకటించారు. ఇంటి నిర్మాణానికి, కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇస్తుందని వెల్లడించారు. మధ్య తరగతి కోసం కోసం కొత్తగా గృహనిర్మాణం విధానం తీసుకురాబోతున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పీఎం అవాస్ యోజన ఇండ్లలో 70శాతం మహిళల పేరుపైనే ఇచ్చామన్నారు. కొవిడ్ కారణంగా సవాళ్లు ఉన్నప్పటికీ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ అమలు కొనసాగించామన్నారు. 3 కోట్ల ఇళ్ల లక్ష్యాన్ని చేరుకోవడానికి దగ్గరగా ఉన్నామన్నారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో మరో 2 కోట్ల ఇళు మంజూరు చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా బడ్జెట్ ప్రసంగం వినిపిస్తూ.. జీడీపీకి ప్రభుత్వం కొత్త అర్థం చెప్పిందన్న ఆర్థిక మంత్రి.. జీడీపీ అంటే గవర్నెన్స్, డెవలప్‌మెంట్ పెర్ఫార్మెన్స్ అని కొత్త అర్థం ఇచ్చామన్నారు. పదేళ్లలో ద్రవ్యోల్బణాన్ని సమతుల్యంగా ఉంచామన్నారు. పదేళ్లలో ప్రజల వాస్తవ ఆదాయం 50శాతానికిపైగా పెరిగిందన్నారు. వాసవ్త అదాయ పెరుగుదల ప్రజల జీవన ప్రమాణాలు పెంచిందన్నారు. ఆశాలు, అంగన్‌వాడీలకు ఆయుష్మాన్ భారత్ పథకం వర్తింపజేస్తున్నట్లు ప్రకటించారు.

# ఇదే ఆఖరి బడ్జెట్ : ప్రతిపక్షాలు





ఢిల్లీ: కేంద్ర మధ్యంతర బడ్జెట్‌పై విపక్షాలు పెదవి విరిచాయి. ప్రధాని మోడీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఇదే ఆఖరి బడ్జెట్ అని పేర్కొన్నాయి. నిర్మలా సీతారామన్ బడ్జెట్‌పై కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. అపజయాలను విజయాలుగా పేర్కొనడం ఈ ప్రభుత్వం ప్రత్యేకత అంటూ ఎద్దేవా చేశారు. 45శాతం యువత ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతుంటే, దాని గురించి ఒక్క ముక్కా మాట్లాడలేదని దుయ్యబట్టారు. యూపీఏ ప్రభుత్వంలో జీడీపీలో ఎఫ్‌డీఐలు 3.6 శాతంగా ఉంటే... ఇప్పుడు ఒక శాతం కూడా లేవని విమర్శించారు. బాజపా ప్రభుత్వానికిదే ఆఖరి బడ్జెట్ అని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ అన్నారు. పదేళ్లుగా ఈ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక బడ్జెట్‌లను ప్రవేశపెడుతోందని, ఆ రికార్డును ఇంకెవరూ తిరగరాయలేరని దుయ్యబట్టారు. ప్రజల అభివృద్ధి పట్టని బడ్జెట్ అర్థం లేనిదంటూ విమర్శించారు. అద్దంలో వెనక్కి చూసుకుంటూ కారు నడుపుతున్నట్లు ఉందంటూ కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ బడ్జెట్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ద్రవ్యలోటు రూ.18 లక్షల కోట్లకు పెరగడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం తన చివరి బడ్జెట్‌ను ప్రవే శ పెట్టిందంటూ ఉద్ధవ్ ఠాక్రే కామెం ట్ చేశారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గుండెను బరువు చేసు కుని బడ్జెట్‌ను ప్రవేశపెట్టారంటూ విమర్శించారు. ఎన్నికల ముందు ప్రజలను ఆకర్షించడానికే ఈ బడ్జెట్ ప్రవేశపెట్టారంటూ కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌధరి విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంపై దృష్టి సారించలేదని దుయ్య బట్టారు. మోదీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు మరోసారి బడ్జెట్ వేదిక అయ్యిందని మధ్య ప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ విమర్శించారు. పదేళ్ల పాలనలో ఏమీ చేయనప్పటికీ... తమను తాము పొగుడుకోవడా నికి ఆర్థిక మంత్రి అధిక సమయమే తీసుకున్నారంటూ డీఎంకే ఎంపీ దయానిధి మారన్ ఎద్దేవా చేశారు. 10 ఏళ్లలో ఏమీ చేయని దానికి శ్వేత పత్రం విడుదల చేయడం ఎందుకో అని ప్రశ్నించారు.

## పన్నుల విధానంలో ఎటువంటి మార్పులు లేవు

ఢిల్లీ: ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో పన్ను విధానాల్లో మార్పుల జోలికి ఆర్థిక మంత్రి వెళ్లలేదు. గత ఏడాది ప్రకటించిన ఆదాయపు పన్ను కొత్త విధానంలో వారికి రూ.7లక్షల వరకు ఎటువంటి పన్నుఉండదని




పునరుద్ఘాటించా రు. ఇది 2013-14లో రూ.2.2లక్షలుగా ఉందని గుర్తుచేశారు. గత ఏడాదే కార్పొరేట్ పన్నును దేశీయ కంపెనీలకు 30శాతం నుంచి 22శాతానికి... కొన్ని రకాల తయారీ రంగ సంస్థలకు 15 శాతానికి తగ్గించినట్లు చెప్పారు. ప్రజల సగటు వాస్తవిక ఆదా యం 50శాతం పెరిగినట్లు చెప్పారు. ప్రత్యక్ష పన్నులకు సంబం ధించి వివాదాస్పద డిమాండ్ నోటీసులు అందుకొన్న వారికి ఊర టనిచ్చారు. 2008-10మధ్య రూ.25వేల వరకు విలువైన డిమా ండ్ నోటీసులను ఉపసంహరించుకొన్నారు. 2010-11 నుంచి 2014-15 ఆర్థిక సంవత్సరాల మధ్య రూ.10వేల వరకు చెల్లిం చాలని జారీఅయిన నోటీసులను రద్దుచేశారు. దీంతో దాదాపు కోటి మంది లబ్ధి పొందనున్నట్లు ఆమె తెలిపారు. వ్యాపారాలను సరళతరం చేయడానికి ఈ నిర్ణయం తీసుకొన్నట్లు పేర్కొన్నారు. ఈక్రమంలో చిన్న మొత్తంలో ఉన్న ప్రత్యక్షపన్ను వివాదాస్పద డిమాండ్ల(నోటీసులు)ను రద్దు చేసుకొంటున్నట్లు వివరించారు.

## విశాఖ రైల్వే జోన్‌కు ఏపీ ప్రభుత్వం భూమి కేటాయించలేదు: రైల్వే మంత్రి

ఢిల్లీ: విశాఖపట్నం రైల్వే జోన్ ఏర్పాటుకు 58 ఎకరాల భూమిని కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఇప్పటికే అడిగామని, అయితే ప్రభుత్వం ఇంకా అప్పగించలేదని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. జోన్ ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధమైందని, భూమి ఇస్తే



పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భాజపా అధికారంలోకి రాకముందు 2009 నుంచి 2014 వరకు ఉమ్మడి ఏపీలో రైల్వే అభివృద్ధికి రూ.806 కోట్ల నిధులు ఇవ్వగా. ప్రస్తుత బడ్జెట్లో ఒక్క ఏపీకే రూ.9,188 కోట్లు కేటాయించామని తెలిపారు. ఆంధ్రాలో ఏడాదికి 240 కి.మీ. మేర నూతన ట్రాక్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. 98 శాతం లైన్ల విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయన్నారు.

## మధ్యంతర బడ్జెట్‌పై పారిశ్రామిక వర్గాల హర్షం

ఢిల్లీ: కేంద్రం ప్రవేశపెట్టినదిమధ్యంతర బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబించేలా, దేశాభివృద్ధికి ఊతం ఇచ్చేలా ఉందని పరిశ్రమల వర్గాలు పేర్కొన్నాయి.ప్రముఖ పారిశ్రామికవేత్తలైన అనంద్ మహీంద్రా, కిరణ్‌మజుందార్ షాతోపాటుపలువురు స్పందించారు.

"ఎన్నికలకు ముందు ప్రకటించే ప్రజాకర్షక పథకాలేవీ ఈ బడ్జెట్‌లో లేవు. పన్నుల విధానాల్లో ఎలాంటి మార్పులు లేవు. జీడీపీలో పన్నుల వాటా పెరగడం శుభ పరిణామం"

*- మహీంద్రా గ్రూపు ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా*

"ఈ బడ్జెట్ 2047 నాటికి భారత్‌ను బలమైన ఆర్థిక శక్తిగా మార్చేందుకు తోడ్పడుతుంది. స్థిరమైన ఆర్థికవృద్ధికి ఆర్థిక మంత్రి రోడ్ మ్యాప్ వేశారు. పరిశోధనలు, ఆవిష్కరణలు, గ్రీన్ టెక్నాలజీ, మౌలిక సదుపాయల అభివృద్ధి, సాంకేతిక ఆధారిత డిజిటల్ పరివర్తనకు కేంద్రం పెద్ద పీట వేసింది"


**- బయోకాన్ ఎండి కిరణ్ మజుందార్ షా**

"ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య సంరక్షణ పథకాన్ని ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు విస్తరిస్తామని కేంద్రం ప్రకటన చేయడం కీలక ముందడుగు. ప్రతి జిల్లాలో ఆసుపత్రులు ఏర్పాటు చేస్తామని చెప్పడం...మారుమూల ప్రాంతాలకు ఆరోగ్య సేవలను విస్తరించాలన్న కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం"

**- జీయిస్ గ్రూప్ ఇండియా సీఎఫ్‌వో ధావల్ రాడియా**

"దేశీయ టూరిజాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఐకానిక్ టూరిజం కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం ఆర్థిక సహాయాన్ని అందించాలనే ప్రతిపాదనను స్వాగతిస్తున్నాం.ఆధ్యాత్మక టూరిజానికి కూడా మద్దతుగా నిలవడం సంతోషకరం"

**- హెూటల్ అండ్ రెస్టారెంట్ ఫెడరేషన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ప్రదీప్ శెట్టి**


విశాఖ రైల్వే జోన్‌కు
జగనే అడ్డంకి
TEAM YELLOW
→ 53 ఎకరాలు ఇవ్వనందునే ఆలస్యం
→ తేల్చి చెప్పిన కేంద్ర మంత్రి
→ సొంత లాభాల కోసమే జగన్ నిరాకరణ
VSKP